నేటి కందం- నేటికి అందం

నలుబది దేశమ్ములతో
పలురీతులుగా ప్రధాని ఫలవంతపు చ
ర్చలు జరిపిన పిమ్మట మన
తలమున దొలగె చమురుకొరతలు వేగముగన్ !!

(41 దేశాలతో చర్చలు జరిపి యుద్ధ సమయంలోకూడా ప్రధాని మోడీ తన చతురతను ప్రదర్శించి మనకు చమురు ఉత్పత్తుల కొరత లేకుండా చేశారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

ప్రసంగాల్లో విద్వేషం
పైన రాష్ట్ర చట్టం
నిరోధించ తీసుకొస్తే
నీతి పెంచే చుట్టం
పడని వాళ్ల ఇరికించ
ప్రయోగిస్తే ప్రమాదం
అందుకొరకే ఆందోళన
అవుతున్నది వివాదం



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 28-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:178 పేజీలు:6 వెల: రూ.1/-


## ఇంధన సంక్షోభం, రాష్ట్రాల సన్నద్ధతపై సీఎంలతో మోదీ సమీక్ష





న్యూఢిల్లీ, మార్చి 27: పశ్చిమాసియాలో ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల కారణంగా అంతర్జాతీయ సంక్షోభం తలెత్తడంతో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇంధన సంక్షోభంపై చర్చించారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, ఎరువుల సరఫరాకు ఎదురవుతున్న సమస్యలు, రాష్ట్రాల సన్నద్ధతను సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు మినహా తక్కిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు.

దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు, ఇంధన సరఫరా స్థిరంగా ఉండేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో అమలు కోసం రాష్ట్రాల సహకారాన్ని ఇప్పటికే కోరింది. పశ్చిమాసియాలో పరిస్థితుల ప్రభావం అంతర్జాతీయంగా అన్ని దేశాలపై పడిందని, భారత్‌పైనా ప్రభావం ఉందని ప్రధాని పార్లమెంటు ఉభయసభల్లోనూ ప్రకటించారు.

కోవిడ్ మహమ్మారిని సమష్టిగా ఎదుర్కొన్నట్టే తాజా పరిస్థితులను కేంద్రం, రాష్ట్ర కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నిత్యవసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అవాంతరం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను కోరారు. టీమిండియా స్పిరిట్‌తో పనిచేసి దేశానికి మార్గదర్శకంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ క్రమంలో ముఖ్యమంత్రులతో మోదీ తాజాగా వర్చువల్ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## భద్రాద్రిలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



భద్రాచలం, మార్చి 27: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీసీతారామయ్య కల్యాణ మహోత్సవంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసీతారాములకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సీఎం రేవంత్ సమర్పించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో మంత్రులు పాల్గొన్నారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

## హార్మూజ్ జలసంధిలో చమురు ట్యాంకర్ ధ్వంసం.. పర్షియన్ గల్ఫ్‌లో ఉద్రిక్తతలు తీవ్రం



న్యూఢిల్లీ, మార్చి 27: ఇరాన్ తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంతో అట్టుడుకుతున్న పర్షియన్ గల్ఫ్‌లో మరోసారి ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. హార్మూజ్ జలసంధి లో తమ నిబంధనలు ఉల్లంఘించి ప్రవేశించిన ఓ ఆయిల్ ట్యాంకర్ పై శుక్రవారం 'ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ క్షిపణులతో దాడిచేసి ధ్వంసం చేసింది. దాడికి గురైన ట్యాంకర్ పాకిస్థాన్ జెండాతో ఉన్నట్లు కథనాలు సూచిస్తున్నాయి. ఇరాన్ హెచ్చరికలను పెడచెవిన పెట్టి జలసంధిని దాటేందుకు ప్రయత్నించడంతోనే ఈ దాడి జరిగినట్లు ఇరాన్ వర్గాలు తెలిపాయి.

మరోవైపు పాకిస్థాన్ జెండా మాటున చమురును అక్రమంగా అమెరికాకు తరలిస్తున్నారని, దానికి ప్రతీకారంగానే ఈ దాడి జరిగిందనే కథనాలు కూడా వినిపిస్తున్నాయి. ట్యాంకర్‌కు మంటలు అంటుకుని పూర్తిగా ధ్వంసమైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనలో సిబ్బంది ప్రాణనష్టంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి హర్మూజ్ జలసంధిని ఇరాన్ తన నియంత్రణలోకి తీసుకుంది.

ఇరాన్ తన అనుమతి లేకుండా హర్మూజ్ జలసంధిలోకి ఏ నౌక ప్రవేశించరాదని ఆంక్షలు విధించింది. దాంతో ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం స్తంభించిపోగా.. 85కి పైగా ట్యాంకర్‌లు గల్ఫ్‌లోనే చిక్కుకుపోయాయి. మార్చి 11న కూడా థాయ్‌లాండ్‌కు చెందిన నౌకపై దాడి జరిగింది. ఈ సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటింది. తాజా ఘటనతో ఈ ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి.

## కిలాడీ దంపతులు.. వివాహిత నుంచి రూ. 55 లక్షలు దోచేశారు..

అన్నమయ్య జిల్లా, మార్చి 27: కిలాడీ దంపతుల మాయ మాటలు నమ్మి ఓ వివాహిత తీవ్రంగా నష్టపోయింది. ఆ దంపతులు సీబీఐలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ వివాహితనుంచి ఏకంగా 55 లక్షల రూపాయలు దోచేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో వారి మోసం బయటపడింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. అన్నమయ్య జిల్లా, పుంగనూరు మండలం వనమలదిన్నెకు చెందిన లావణ్య అనే వివాహితకు కొన్ని నెలల క్రితం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హేమప్రద అనే మహిళతో పరిచయం అయింది.

కొద్దిరోజుల తర్వాత హేమప్రద తన భర్త అశోక్‌ను సీబీఐ అధికారి అంటూ లావణ్యకు పరిచయం చేసింది. ఈ నేపథ్యంలో అశోక్, హేమప్రదలు సీబీఐలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు.

లావణ్య వద్దనుంచి 10 లక్షల రూపాయల నగదు, 42 లక్షల రూపాయల చెక్కులు తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవటంతో తాను మోసపోయానని లావణ్య గుర్తించింది.

భార్యాభర్తలపై పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

## మునీరాబాద్‌లో పార్టీ ఆవిర్భావ వేడుక



హైదరాబాద్, మార్చి 27: తెలంగాణ రాజకీయాల్లో కొత్త పరిణామం చోటుచేసుకోనుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. కొత్త పార్టీ ఏర్పాటు గురించి నెలకొన్న ఊహాగానాలకు తెరదీస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత స్పష్టత ఇచ్చారు. నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె కొత్త పార్టీ వివరాలను వెల్లడించారు.

ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు నూతన రాజకీయ పార్టీని అధికారికంగా స్థాపించనున్నట్లు కవిత ప్రకటించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్ లో 35వేలమంది కార్యకర్తలతో పార్టీ ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయినా, ప్రధాన ఆశయాలు ఇంకా నెరవేరలేదని ఆమె అభిప్రాయపడ్డారు. అందరి కోసం పనిచేసే ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరం ఏర్పడిందని, అదే ఉద్దేశంతో కొత్త పార్టీని స్థాపిస్తున్నట్లు కవిత తెలిపారు. తెలంగాణ జాగృతి ద్వారా ఇప్పటివరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించామని, వాటిని మరింత విస్తృతంగా కొనసాగించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## రాయవరం బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన ఏపీ మంత్రులు..

అమరావతి, మార్చి 27:మార్కాపురం మండలం రాయవరం ప్రమాద బాధితులను ఆంధ్రప్రదేశ్ మంత్రులు బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పరామర్శించారు. ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని చికిత్సపొందుతున్న బాధితులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని.. ఎవ్వరూ అధైర్య పడ

ఈ సందర్భంగా మంత్రి బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. 'మార్కాపురంలో బస్సు ప్రమాద ఘటనగ్భ్రాంతికి గురి చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. హోమ్ మినిస్టర్ అనిత, రవాణా శాఖ మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డిని ఘటనా స్థలానికి పంపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం వెంటనే స్పందించారు. ప్రస్తుతం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందుతోంది. బాధితులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాయి. ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఘటనపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, గవర్నర్ అందరూ స్పందించారు' అని చెప్పారు.

మార్కాపురంలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అత్యంత బాధాకరమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. క్షతగాత్రులు కోలుకుని ఇంటికి వెళ్లే దాకా చంద్రబాబు సర్కార్ బాధ్యత తీసుకుంటుందని అన్నారు. ప్రమాదంలో మరణించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాయని ఆయన పేర్కొన్నారు. అలాగే గాయపడిన వారికి ఏపీ ప్రభుత్వం రూ.2లక్షలు, కేంద్రం రూ.50వేలు ప్రకటించాయని చెప్పారు. బాధితులంతా కూలి పనులు చేసుకునే పేదవాళ్లని, వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. కాగా, ఈ ప్రమాదంలో 14 మంది మృతిచెందగా.. 28 మంది గాయపడిన సంగతి తెలిసిందే.

## వారంలో రెండుసార్లు పారిపోయిన మహిళ.. ఆమె భర్తను బెదిరించిన ప్రియుడు

లక్నో, మార్చి 27: వివాహిత మహిళ తన ప్రియుడితో కలిసి వారం రోజుల్లో రెండుసార్లు ఇంటి నుంచి పారిపోయింది. భర్త తొలి ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు ఆ మహిళను వెతికి తెచ్చారు. అయితే ఆ మరునాడే మరోసారి ఆ వ్యక్తితో కలిసి ఆమె పారిపోయింది. ఈ సందర్భంగా ఆమె భర్తను ప్రియుడు బెదిరించాడు. ఉత్తరప్రదేశ్‌లోని బాందా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 24 ఏళ్ల వివాహిత మహిళ తన ప్రియుడు జిలేదార్ ఖాన్‌తో కలిసి వారం రోజుల కిందట ఇంటి నుంచి పారిపోయింది. భర్త ఫిర్యాదుపై ఆమె కోసం పోలీసులు వెతికారు. ఆ మహిళ ఆచూకీని గుర్తించారు. మార్చి 23న భర్తకు ఆమెను అప్పగించారు.

కాగా, మరునాడైన మార్చి 24న ప్రియుడు జిలేదార్ ఖాన్ మళ్లీ ఆ మహిళ ఇంటికి వచ్చాడు. దీంతో వారిద్దరూ ఇంటి నుంచి వెళ్తుండగా ఆమె భర్త అడ్డుకున్నాడు. ఈ నేపథ్యంలో అతడ్ని దూషించడంతో పాటు చంపుతానని జిలేదార్ ఖాన్ బెదిరించాడు. అతడి భార్యను తీసుకుని వెళ్లిపోయాడు.

మరోవైపు ప్రియుడు జిలేదార్ ఖాన్‌తో కలిసి తన భార్య రెండోసారి పారిపోయినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో భర్త ఫిర్యాదు చేశాడు.

## నిలిచి ఉన్న లారీని ఢీకొట్టిన వాహనం.. ముగ్గురు పిల్లలతో సహా 8 మంది మృతి, 27 మందికి గాయాలు



లక్నో, మార్చి 27: రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని పికప్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు పిల్లలతో సహా 8 మంది మరణించారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నారు.

మరో 27 మంది గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక గ్రామానికి చెందిన పలు కుటుంబాలు ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తలనీలాల సమర్పణ కార్యక్రమానికి హాజరయ్యారు. పికప్ వాహనంలో వారు తిరుగు ప్రయాణమయ్యారు.

కాగా, శుక్రవారం కౌశాంబి జాతీయ రహదారిలోని దోర్మా గ్రామం సమీపంలో వేగంగా వెళ్తున్న పికప్ వ్యాన్ రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు మరణించారు. మరో 27 మంది తీవ్రంగా గాయపడ్డారు.

మరోవైపు ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలో ఉన్న పలు ఆసుపత్రులకు తరలించారు.

అయితే గాయపడి చికిత్స పొందుతున్న వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నదని పోలీస్ అధికారి తెలిపారు. పికప్ వాహనం డ్రైవర్ నిద్ర మత్తులో జోగడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు.

ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# సంగీత పరిశ్రమలో మహిళలకు స్థానం లేదా !

(28 మార్చి "అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం" సందర్భంగా)

సంగీత రంగంలో మహిళల పాత్రను ప్రశంసించడం, వారిని ప్రోత్సహించడం, ఈ రంగంలో లింగ సమానత్వాన్ని సాధించడం, మంచి మహిళా సంగీత విద్వాంసులను సన్మానించడం, మహిళా సంగీతకారుల ప్రభావాన్ని గుర్తు చేసుకోవడం, భవిష్యత్తులో మహిళా సంగీతకారులకు సముచిత స్థానం కల్పించడం లాంటి అంశాల్లో పాల్గొనడానికి ప్రతి ఏటా 28 మార్చి రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం (ఇంటర్నేషనల్ వూమెన్ ఇన్ మ్యూజిక్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. సంగీత పరిశ్రమలో మహిళలు చాలా చక్కువగా ఉన్నారు. మహిళామణులకు తగిన ప్రోత్సాహం కూడా కరువైంది. నేపథ్య గానం, సంగీత దర్శకత్వం, సంగీత నిర్మాతలు, సంగీత కళాకారులు లాంటి రంగాల్లో పురుషుల ఆధిపత్యం అనాదిగా కొనసాగుతూ వస్తున్నది.

### భారత సంగీత రంగంలో మహిళా కళాకారులు:

భారతీయ సంగీతరంగాన్ని సుసంపన్నం చేసిన మహిళల్లో ఎం ఎస్ విజయలక్ష్మి, లతా మంగేష్కర్, ఆశా భోంస్లే, శ్రేయ ఘోషాల్ లాంటి వారు ఎందరో ఉన్నారు. వీరు తమ సంగీత కళతో మానవాళిని మెప్పించి పురుషాధిక్యతను అధిగమించి తమదైన ముద్రను వేయడం హర్షదాయకం. ప్రముఖ గాయనీమణుల్లో లతా మంగేష్కర్, శ్రేయా ఘోషాన్ లాంటి వారు ఉండగా, శాస్త్రీయ సంగీతంలో ఎం ఎస్ సుబ్బలక్ష్మి, గౌహర్ జాన్, అక్తరి బాయి లాంటి మహిళలు ఉన్నారు.

సంగీత వాయిద్యకారుల వర్గంలో మృదంగం, తబలా, ఘటం, కంజీరా వంటి వాయిద్యాలను వాయించే మహిళలు కూడా కొందరు ఉండడం విశేషం.

రుద్ర వీణ కళాకారిణి జ్యోతి హెగ్డే, సంగీత దర్శకులుగా ఉషా ఖన్నా, జద్దన్ బాయి, సరస్వతి దేవి లాంటి కళాకారులు ఉన్నారు. ఆధునిక భారతీయ సంగీత ప్రపంచంలో శ్రేయ ఘోషల్, నేహా కక్కర్, సన్నిధి చౌహాన్ వంటి నేటి మేటి తరం గాయనీమణులా ప్రపంచ గుర్తింపును కూడా పొందారు.

తెలుగు సంగీత ప్రపంచంలో ఎం ఎం శ్రీలేఖ, భానుమతి రామకృష్ణ లాంటి ప్రముఖులు సంగీత దర్శకులుగా మంచి పేరు తెచ్చుకున్నారు. అలాగే గాయనీమణులుగా సుశీల, జానకి, చిత్ర, సునితా, మంగ్లీ లాంటి వర్తమాన కళాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారు.

### సంగీత పరిశ్రమలో లింగ సమానత్వం:

ప్రపంచవ్యాప్తంగా మహిళలు సంగీత ప్రపంచాన్ని ఉర్రూతలూగించారు. కాని వారి సంఖ్య చాలా స్వల్పం. అర్థాలు ఫ్రాక్లిన్, బయాంన్స్, లేదా మంగేష్కర్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత సంగీతకారులు మానవాళిపై చెరగని ముద్రను వేసారు. సంగీత పరిశ్రమ పురుషుల చేతుల్లో ఉన్నది. ఆసక్తి, అర్హత కలిగిన మహిళలకు సహితం సరైన అవకాశాలు దొరకడం లేదు.

సంగీత రంగంలో మహిళలకు నాయకత్వ బాధ్యతలు ఇవ్వడానికి పురుష సమాజం సిద్ధంగా లేదు. తగిన గుర్తింపు, వేతన వ్యత్యాసాలు మహిళలను వేధిస్తున్నాయి.

సంగీర ప్రపంచంలో అడుగిడడానికి మహిళలకు పరిమితులు విధించబడ్డాయి.

మహిళా సంగీత విద్వాంసుల నైపుణ్యాలను గుర్తించడం, అర్హత కలిగిన మహిళలకు అవకాశాలు ఇవ్వడం, మహిళా సందగీతకారులకు స్వేచ్ఛను ఇవ్వడం, మహిళల సంగీత కచేరీలు లేదా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, సంగీత పరిశ్రమలో లింగ సమానత్వ సాధనకు కృషి చేయడం లాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి.

### సంగీతం ఓ శక్తివంతమైన విశ్వ భాష :

సంగీతం అత్యంత ప్రభావితం చేయగల ఓ విశ్వ భాష. మాటలు ఆగిన చోట సంగీత స్వరాల పలుకులు ప్రారంభం అవుతుంది.

సంగీతం ఓ దివ్య ఔషధం. మాటల్లో చెప్పలేని విషయాలను సంగీత మాధ్యమంగా వర్ణించవచ్చు. సంగీతం లేని జీవితం నిస్సారం. ప్రపంచాన్ని జాగృతం చేయగల శక్తి సంగీతానికి ఉంటుంది.

సాంప్రదాయ సంగీతం నుంచి ఆధునిక సంగీతం వరకు మహిళలు తమ అంకితభావం, నైపుణ్యంతో దేశ సంగీత చిత్రపటాన్ని నిరంతరం పునర్నిర్వహిస్తూనే ఉన్నారు, భవిష్యత్తులో నిర్వహిస్తారు కూడా.

సంగీతం ఓ నిర్మలమైన నదీ ప్రవాహం. సంగీతానికి ఎల్లలు లేవు.

"అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం" సందర్భంగా ఇలాంటి అత్యంత ప్రభావం కలిగిన సంగీత జగత్తులోకి అర్హులు, ఆసక్తి మెండుగా ఉన్న మహిళామణులను ఆహ్వానిద్దాం, వారి సంగీత రాగాలను ఆస్వాదిద్దాం.



–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రూ.11,200 కోట్ల వ్యయంతో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయంలో అభివృద్ధి చేసిన ఫేజ్-ఎను ప్రారంభించనున్న పీఎం

న్యూఢిల్లీ, మార్చి 27: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్చి 28, 2026న ఉత్తరప్రదేశ్ లో పర్యటించనున్నారు. ఆ రోజున ఉదయం 11:30కి గౌతమ బుద్ధ నగర్‌లోని జేవార్ వద్దనున్న నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని, టెర్మినల్ భవనాన్ని పరిశీలిస్తారు. 12 గంటలకు నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ ఫేజ్-ఎను ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం.. ప్రపంచ విమానయాన కేంద్రంగా భారత్ ఎదిగే క్రమంలో కీలక ఘట్టాన్ని సూచిస్తుంది. జాతీయ రాజధాని ప్రాంతానికి (ఎన్‌సీఆర్) ప్రధాన అంతర్జాతీయ ద్వారంగా ఏర్పాటైన ఈ విమానాశ్రయం.. ఎయిర్‌పోర్టు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయటంలో ప్రాంతీయ, అంతర్జాతీయ అనుసంధానతను మెరుగుపరచటంలో కీలక ముందడుగు. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుబంధంగా, ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతానికి రెండో అంతర్జాతీయ విమానాశ్రయంగా నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేశారు.

ఈ రెండు విమానాశ్రయాలు సమగ్ర విమానయాన వ్యవస్థగా పనిచేయటం ద్వారా రద్దీ తగ్గటమే కాక, ప్రయాణికుల సామర్థ్యం పెరగటంతో ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం ప్రపంచంలోని ప్రధాన విమానయాన కేంద్రాల సరసన నిలుస్తుంది.

భారతదేశంలోని అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ ప్రాజెక్టుల్లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ఒకటి. ఈ విమానాశ్రయ మొదటి దశ అభివృద్ధి పనులు రూ.11,200 కోట్ల వ్యయంతో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో జరిగాయి.

ప్రారంభంలో ఏడాది కి 12 మిలియన్ల ప్రయాణికుల సామర్థ్యంతో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయగా.. భవిష్యత్తులో 70 మిలియన్లకు పెంచుకునే అవకాశం ఉంది. ఇక్కడున్న 3,900 మీటర్ల పొడవైన రన్‌వే.. భారీ విమానాల రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది. వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా 24 గంటల పాటు కార్యకలాపాలు సాఫీగా సాగేలా ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండిగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్), అధునాతన ఎయిర్ ఫీల్డ్ లైటింగ్ వంటి అత్యాధునిక నావిగేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు.

సమగ్ర సరకు రవాణా కేంద్రం, సమగ్ర సరకు టెర్మినల్, లాజిస్టిక్స్ జోన్లతో పటిష్ఠమైన సరకు రవాణా వ్యవస్థలు ఈ విమానాశ్రయంలో ఉన్నాయి. ఏటా 2.5 లక్షల మెట్రిక్ టన్నుల రవాణా సామర్థ్యంతో రూపొందించిన సరకు రవాణా కేంద్రం.. భవిష్యత్తులో సుమారు 18 లక్షల మెట్రిక్ టన్నులకు విస్తరించుకునే వెసులుబాటు ఉంది.

విమానాల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్ హాలింగ్ (ఎంఆర్ఓ) కోసం ప్రత్యేకంగా 40 ఎకరాల విస్తీర్ణంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

సుస్థిర, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని రూపొందించారు. ఇంధన సామర్థ్య వ్యవస్థలు, పర్యావరణహిత పద్ధతులను అనుసరిస్తూ కర్బన ఉద్గార రహితంగా ఉండాలని ఈ విమానాశ్రయం లక్ష్యంగా పెట్టుకుంది. భారత వారసత్వ స్ఫూర్తితో సంప్రదాయ ఘాట్లు, హవేలీలను ప్రతిబింబించేలా దీని నిర్మాణ శైలి ఉంది. సాంస్కృతిక కళను ఆధునిక మౌలిక సదుపాయాలతో మిళితం చేస్తూ అద్భుతంగా ఈ విమానాశ్రయం రూపుదిద్దుకుంది.

యమునా ఎక్స్‌ప్రెస్‌వేకు సమీపంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉన్న నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం.. ప్రయాణికులు, సరకురవాణాకు సౌకర్యంగా ఉంటుంది. రోడ్డు, రైలు, మెట్రో, ప్రాంతీయ రవాణా వ్యవస్థల అనుసంధానంతో సమగ్ర రవాణా కేంద్రంగా రూపొందించారు.

## ఆవిష్కరణ వ్యవస్థ బలోపేతానికి, అంకుర సంస్థలకు మద్దతిచ్చేందుకు డిజిటల్ ఎంటర్‌టైన్ మెంట్ సంస్థతో డీపీఐఐటీ ఒప్పందం

న్యూఢిల్లీ, మార్చి 27:దేశంలోని అంకుర సంస్థలు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు మద్దతిచ్చేందుకు డిజిటల్ ఎంటర్‌టైన్ మెంట్ సంస్థతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీనిని దేశ స్టార్టప్, ఆవిష్కరణ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కీలక చర్యగా భావిస్తున్నారు.

డిజిటల్ వినోదం, ఆన్‌లైన్ గేమింగ్, ఈ-స్పోర్ట్స్, ఇంటరాక్టివ్ మీడియా, కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక వంటి రంగాల్లో పనిచేసే అంకుర సంస్థల వృద్ధిని ప్రోత్సహించడమే ఈ ఒప్పంద లక్ష్యం. నిర్మాణాత్మకమైన పరిశ్రమ భాగస్వామ్యం ద్వారా అంకుర సంస్థలు విస్తరించదగిన, పరిశ్రమ అవసరాలకు తగిన పరిష్కారాలను అభివృద్ధి చేనయుడానికి ఇది దోహదపడుతుంది.

ఈ ఒప్పందంలో భాగంగా అంకుర సంస్థలకు మార్గదర్శకత్వం, పరిశ్రమల గురించి అవగాహన, అవగాహనా వేదికలు, ఎంపిక చేసిన భాగస్వామ్య అవకాశాలనూ కల్పిస్తారు. అంకుర సంస్థలు ప్రూఫ్-ఆఫ్-కాన్సెప్ట్ అభివృద్ధి, మార్కెట్ ప్రవేశం, పరిశ్రమ వ్యవస్థలలో విలీనం వంటి కీలక అంశాల్లో విజయం సాధించేందుకు ఈ భాగస్వామ్యం సహకారం అందిస్తుంది.

ఈ సందర్భంగా డీపీఐఐటీ సంయుక్త కార్యదర్శి శ్రీ సంజీవ్ మాట్లాడుతూ.. భారత డిజిటల్, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ భాగస్వామ్యాన్ని కీలక ముందడుగుగా అభివర్ణించారు. ఇటువంటి చర్యలు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో అంకుర సంస్థలు నూతన ఆవిష్కరణలు రూపొందించడానికి, తమ కార్యకలాపాలను విస్తరించుకోవడానికి, ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల పరిష్కారాలను రూపొందించడానికి వీలు కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు.

ఈ ఒప్పందం ద్వారా డీపీఐఐటీ సంస్థ క్రాఫ్టన్ ఇండియా సంస్థతో కలిసి పనిచేస్తుంది. భారత్ స్టార్టప్ గ్రాండ్ ఛాలెంజ్ కింద ఆవిష్కరణల సవాళ్లను నిర్వహించడంతో పాటు.. గేమ్ డిజైన్, యానిమేషన్, లీనమయ్యే అనుభూతినిచ్చే సాంకేతికతలు, ఈ-స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, కృత్రిమ మేధ అప్లికేషన్ల వంటి రంగాలలో హ్యాకథాన్‌లు, వర్క్‌షాప్‌లు, మాస్టర్‌క్లాస్‌లను నిర్వహించనున్నారు.

# బస్సు ప్రమాద బాధితులను మంత్రుల పరామర్శ..



అమరావతి, మార్చి 27:మార్కాపురం వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడి, ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రులు డోలా బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, దామచర్ల జనార్ధన్, బి ఎన్ విజయ్ కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ లు శుక్రవారం పరామర్శించారు. మొత్తం 13 మంది బాధితులతో మాట్లాడి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు.

కందుకూరు నియోజకవర్గం వలేటివారి పాలెం మండలం అంకభూపాలపురం గ్రామానికి చెందిన బత్తుల మణెమ్మ కూడా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రిమ్స్ లో చికిత్స పొందుతోంది. రెండు చేతులు విరిగిపోగా, లివర్ కు గాయం కావడంతో ఆపరేషన్ చేశారు. మంత్రులు సహచర ఎమ్మెల్యేలతో కలిసి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆమెను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. మణెమ్మ భర్త వెంకటయ్యతో మాట్లాడి ఆర్థిక సహాయం అందించారు. మణెమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ బస్సు ప్రమాదంలో 14 మంది చనిపోవడం అత్యంత బాధాకరమైన సంఘటన అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడ్డవారు పూర్తిగా కోలుకునేంతవరకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇలాంటి ప్రమాదం మరోసారి జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెంట అంకభూపాలపురం టిడిపి సీనియర్ నాయకులు పెగడ శ్రీనివాసులు, బండారు సోమరాజు తదితరులు ఉన్నారు.

# గడ్డి మందు పర్యావరణం, ఆరోగ్యానికి ప్రమాదకరం

**-ఆత్మహత్యలకు ఆయుధంగా మారిన పారాక్వాట్**
**-పారాక్వాట్‌తో రైతులు, ప్రజల ప్రాణాలకు ముప్పు**
**-ప్రాణాంతక గడ్డి మందుపై చర్యలు తీసుకోవాలి**
**-వైద్య వర్గాలు గడ్డి మందు నిషేధాన్నీ కోరుతున్నాయి**
**-లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్**

వరంగల్, మార్చి 27:దేశవ్యాప్తంగా తీవ్ర ఆరోగ్య, పర్యావరణ ప్రమాదాలకు కారణమవుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) అనే అత్యంత ప్రమాదకర హెర్బిసైడ్‌పై తక్షణమే పూర్తి నిషేధం విధించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎంపీ కావ్య ఆందోళన వ్యక్తం చేశారు.

పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) వినియోగం వల్ల నేల, నీరు, ఇసుక తీవ్రంగా కాలుష్యం అవుతున్నాయని ఎత్తి చూపారు.

దీని ప్రభావం వ్యవసాయ వ్యవస్థలపై తీవ్రమవుతోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ఇది కేవలం పర్యావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాణాంతక ముప్పుగా మారిందని హెచ్చరించారు. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, ఈ రసాయనం గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలకు మరణాయుధంగా మారిందని ఎంపీ కావ్య పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో దాదాపు 100 శాతం మరణాలు సంభవిస్తున్నాయని, దీనికి ఇప్పటివరకు సమర్థవంతమైన యాంటిడోట్ లేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని అన్నారు.

తెలంగాణలోని వరంగల్ తో సహా పలు జిల్లాల్లో ఇది



ఆత్మహత్యలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రమాదకర సాధనంగా మారిందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, పర్యావరణం, సామాన్య ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) తయారీ, విక్రయం, వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ సహా పలువురు వైద్య నిపుణులు, ప్రజాప్రతినిధులు కూడా ఇదే అంశంపై ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తూ నిషేధం కోసం ఒత్తిడి తెస్తున్నారని ఎంపీ గుర్తుచేశారు. ప్రమాదకర రసాయనాలకు బదులుగా సురక్షిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.

## ఈతకెళ్లి నలుగురు మృతి

అమరావతి, మార్చి 27: కర్నూల్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లిన నలుగురు ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా కలకలం రేపింది.

కర్నూల్ జిల్లా కోసిగి మండలం కందుకూరులో తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లిన నలుగురు మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. మృతుల్లో ఇద్దరు యువకులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. కాగా, మృతులంతా కర్ణాటక రాష్ట్రంలోని కురుడి గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

# వైభవంగా సీతారామ కళ్యాణ మహోత్సవం..

**-పాల్గొన్న కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం దంపతులు**



అమరావతి, మార్చి 27:త్రిపురవరం గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం లో సీతారామ కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించబడింది. కొల్లి మార్షల్ స్టాలిన్, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, నెట్టెం స్వర్ణ కుమారి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా, వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దివ్య దర్శనం పొందారు. నెట్టెం రఘురాం దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో కళ్యాణోత్సవాన్ని వీక్షించారు. నిర్వాహకులు భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు. సీతారాముల కల్యాణం లోకకల్యాణానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ వేడుకలు గ్రామంలో ఐక్యత, ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని స్థానికులు పేర్కొన్నారు.

# ఉద్దేశపూర్వకంగా చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి 27: భారతదేశంలో పెట్రోలియం, ఎల్పీజీ సరఫరా పూర్తి సురక్షితంగా, నియంత్రణలోనే ఉందని పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ తెలిపింది. అన్ని రీటెయిల్ ఇంధన అవుట్‌లెట్లలోనూ సరిపడినన్ని నిల్వలు ఉన్నాయి. దేశంలో ఎక్కడా పెట్రోలు, డీజిలు, ఎల్పీజీకి కొరత లేదు. తప్పుదోవ పట్టించేలా ఉద్దేశపూర్వకంగా చేపడుతున్న దుష్ప్రచారాన్ని నమ్మి ఆందోళనకు గురి కావద్దని ప్రజలకు మంత్రిత్వ శాఖ పిలుపునిచ్చింది.

**పెట్రోలు, డీజిలు: కొరత లేదు, పరిమితులు విధించలేదు**

ఇంధన భద్రతలో భారత్ బలమైన స్థానంలోనే ఉంది. పెట్రోలియం ఉత్పత్తులను శుద్ధి చేసే దేశాల్లో నాలుగో స్థానంలోనూ, ఎగుమతుల్లో అయిదో స్థానంలోనూ భారత్ ఉంది. 150కి పైగా దేశాలకు శుద్ధి చేసిన ఇంధనాన్ని సరఫరా చేస్తోంది. ప్రపంచానికి భారత్ నికర ఎగుమతిదారుగా ఉన్నందు వల్ల దేశీయంగా పెట్రోలు, డీజిలు లభ్యతకు నిర్మాణాత్మక భరోసా ఉంది. దేశవ్యాప్తంగా లక్షకి పైగా ఉన్న రీటెయిల్ ఇంధన కేంద్రాలు తెరిచే ఉన్నాయి. వాటి ద్వారా ఎలాంటి ఆటంకం లేకుండా సరఫరా కొనసాగుతోంది. రేషన్ విధానంలో సరఫరా చేయాలని ఏ కేంద్రానికీ చెప్పలేదు. ప్రపంచ వ్యాప్తంగా ధరల పెరుగుదల, రేషన్ విధానంలో పంపిణీ, సరి-బేసి వాహన నియంత్రణలు, స్టేషన్లను నిర్బంధంగా మూసివేయడం లాంటి సమస్యలను అనేక దేశాలు ఎదుర్కొంటున్నాయి. కొన్ని దేశాలు 'జాతీయ ఇంధన అత్యవసర పరిస్థితి'ని విధించాయి. ఇలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం భారత్‌కు ఏ మాత్రమూ లేదు. ఇతర దేశాలు ఇంధన సరఫరాలో పరిమితులను విధించే పరిస్థితి ఉంటే.. భారత్‌లో మాత్రం ఇంధన కొరత లేదు. సోషల్ మీడియాలో కొన్ని వీడియోలతో ఉద్దేశపూర్వకంగా అసత్యాలను ప్రచారం చేయడం వల్ల ఆందోళనతో కొన్ని పంపు స్టేషన్లలో కొనుగోళ్లు జరిగాయి. పంపుల వద్ద డిమాండ్ ఒక్కసారిగా పెరిగినప్పటికీ.. వినియోగదారులందరికీ ఇంధన పంపిణీ జరిగింది. సరఫరాను కొనసాగించడానికి ఇంధన సంస్థల డిపోలు రేయింబవళ్లూ పనిచేస్తున్నాయి. పంపు యజమానులకు ఎదురవుతున్న మూలధన ఇబ్బందుల కారణంగా వారికిచ్చే క్రెడిట్ గడువును చమురు సంస్థలు మూడు రోజులకు పెంచేలా చర్యలు చేపట్టాం. గతంలో దీనికి ఒక రోజు మాత్రమే గడువు ఉండేది.

**ముడిచమురు సరఫరా: భర్తీ అయిన లోటు**

హోర్మూజ్ జలసంధి దగ్గర క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ, గతంలో ఈ మార్గం నుంచి దిగుమతి చేసుకున్న దాని కంటే ఎక్కువ చమురును ప్రస్తుతం భారతదేశం దిగుమతి చేసుకుంటోంది. ఇప్పుడు 41కి పైగా దేశాల నుంచి ముడి చమురు దేశానికి చేరుకుంటోంది. అంతర్జాతీయ మార్కెట్లలో ముఖ్యంగా పశ్చిమార్ధ గోళంలో అధిక ముడి చమురు అందుబాటులో ఉంది. ఇది మనకు ఏర్పడిన లోటు కంటే అధికంగానే సరఫరా చేసింది. దేశంలో ఉన్న ప్రతి చమురు శుద్ధి కర్మాగారం 100 శాతం కంటే ఎక్కువ సామర్థ్యంతో పనిచేస్తోంది. వచ్చే 60 రోజులకు అవసరమైన ముడి చమురు కేటాయింపులకు సంబంధించిన ఒప్పందాలను భారతీయ చమురు సంస్థలు ఖరారు చేసుకున్నాయి. ఎక్కడా సరఫరా లోపం లేదు.

**వ్యూహాత్మక నిల్వలు: సమగ్ర సమాచారం**

కొన్ని కథనాలు, సామాజిక మాధ్యమ వీడియోల ద్వారా దేశంలో కేవలం 6 రోజులకు మాత్రమే సరిపడ నిల్వలు ఉన్నాయని అసత్య సమాచారం ప్రచారమవుతోంది. భారత్ వద్ద మొత్తం 74 రోజులకు సరిపడా ఇంధన నిల్వ సామర్థ్యం ఉంది. మధ్యప్రాచ్యంలో సంక్షోభం ప్రారంభమై 27 రోజులు గడిచినప్పటికీ భారత్ వద్ద ప్రస్తుతం 60 రోజులకు సరిపడే నిల్వలు (ముడి చమురు నిల్వలు, ఉత్పత్తుల నిల్వలు, గనుల్లో ఉన్న వ్యూహాత్మక నిల్వలతో సహా) ఉన్నాయి. అంతర్జాతీయంగా ఎలాంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ వచ్చే రెండు నెలల పాటు ప్రతి భారతీయునికి స్థిరమైన సరఫరా అందుబాటులో ఉంటుంది. వచ్చే రెండు నెలలకు అవసరమైన ముడిచమురు సైతం సమకూరింది. వచ్చే కొన్ని నెలల పాటు ఇంధన సరఫరా విషయంలో భారత్ పూర్తిగా సురక్షితమైన స్థానంలోనే ఉంది. సరఫరాలో అవాంతరాలు తలెత్తితే వ్యూహాత్మక గనుల నిల్వలు ద్వితీయ ప్రాధాన్యంగా మారతాయి. కాబట్టి భారతలో నిల్వలు తరిగిపోయాయని, సరిపడినంత లేవని చెప్పే వార్తలేవైనా సరే వాటిని నిరాధారమైనవిగా పరిగణించాలి.

**ఎల్పీజీ: పెరిగిన ఉత్పత్తి, తగ్గిన దిగుమతి అవసరం... కార్గోలు సురక్షితం**

దేశంలో ఎల్పీజీకి కొరత లేదు. మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఎల్పీజీ నియంత్రణ ఉత్తర్వులతో దేశీయ రిఫైనరీ ఉత్పత్తి 40 శాతం మేర పెరిగింది. మన రోజువారీ అవసరం 80 టీఎంటీలు కాగా, దేశంలో రోజువారీ ఎల్పీజీ ఉత్పత్తి 50 టీఎంటీలకు (మన అవసరాల్లో 60 శాతానికి పైగా) చేరుకుంది. దీంతో రోజువారీ నికర దిగుమతి అవసరాలు 30 టీఎంటీలకు తగ్గాయి. అంటే దిగుమతుల కంటే భారత్ ఎక్కువ ఉత్పత్తి చేస్తోందని అర్థం. దేశీయ ఉత్పత్తికి అదనంగా అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల నుంచి 800 టీఎంటీలకు భరోసానిచ్చేలా ఎల్పీజీ కార్గోలు భారత్‌లోని 22 ఎల్పీజీ దిగుమతి టెర్మినళ్లకు చేరుకుంటున్నాయి. 2014లో ఈ టెర్మినళ్ల సంఖ్య 11గా ఉండేది. సుమారుగా ఒక నెలకు సరిపడేంత ఇంధనం సరఫరాకు సిద్ధంగా ఉంది. అదనపు నిల్వల సేకరణ ఖరారు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి రోజూ 50 లక్షలకు పైగా సిలిండర్లను చమురు సంస్థలు పంపిణీ చేస్తున్నాయి. వినియోగదారులు ఆందోళనతో చేసిన ఆర్డర్ల కారణంగా ఈ డిమాండు 89 లక్షలకు చేరుకుంది. తిరిగి ఇది 50 లక్షల సిలిండర్లకు తగ్గింది. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ అమ్మకాలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపుల అనంతరం వాణిజ్య సిలిండర్ కేటాయింపును 50 శాతానికి పెంచాం.

**పీఎన్‌జీకి ప్రోత్సాహం: ఇది సంక్షోభానికి ప్రతిస్పందన కాదు.. ఇప్పటికే అమల్లో ఉన్న మార్పు**

రాష్ట్ర ప్రభుత్వాల పూర్తి సహకారంతో పైపుల ద్వారా సహజవాయువు సరఫరాను ప్రోత్సహిస్తున్నాం. ఎందుకంటే ఇది చవకైనది, శుద్ధమైనది, భారతీయ గృహాలకు సురక్షితమైనది. భారతదేశానికి రోజువారీగా అవసరమయ్యే మొత్తం 191 ఎంఎంఎస్‌సీఎండీల సహజ వాయువులో ఇప్పటికే 92 ఎంఎంఎస్‌సీఎండీల సహజ వాయువును దేశీయంగా ఉత్పత్తి చేస్తోంది. దీనివల్ల ఎల్పీజీతో పోలిస్తే గ్యాసు దిగుమతులపై భారత్ తక్కువ ఆధారపడి ఉంది. 2014లో నగర గ్యాస్ పంపిణీ 57 భౌగోళిక ప్రాంతాలకు పరిమితమై ఉండగా ప్రస్తుతం అది 300 ప్రాంతాలకు విస్తరించింది. గృహావసరాల కోసం పీఎన్జీ కనెక్షన్లు 25 లక్షల నుంచి 1.5 కోట్లకు పైగా పెరిగాయి. ప్రస్తుత పరిస్థితులు తలెత్తడానికంటే ముందే ఈ మార్పు మొదలైంది. ఇది భారత్ అనుసరిస్తున్న దీర్ఘకాలిక ఇంధన వ్యూహాన్ని ప్రతిబింబిస్తుంది. ఎల్పీజీ కొరత వల్లే పీఎన్జీని ప్రోత్సహిస్తున్నామని ప్రచారమవుతున్న సమాచారం అబద్ధం. ఎల్పీజీ సరఫరాకి ఎలాంటి ఢోకా లేదు. భారతీయ గృహాలకు మెరుగైన, అందుబాటు ధరల్లో లభించే, సౌకర్యవంతమైన ఇంధనం పీఎన్జీ.

సామాజిక మాధ్యమాల్లో తప్పుదారి పట్టించే వీడియోలను పోస్టుల రూపంలో ప్రచారం చేయడాన్ని మంత్రిత్వ శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. ఇంధన కొరత ఉందనే భావనను కలిగించేందుకు ఎంపిక చేసిన క్యూల చిత్రాలను, ఇతర దేశాల్లో రేషన్ ఇస్తున్న అంతర్జాతీయ వార్తల దృశ్యాలను వాడుతున్నారని గమనించింది. భారత్‌లో లాక్‌డౌన్లు, ఇంధన నియంత్రణలను విధిస్తున్నారని పూర్తిగా బూటకపు వాదనలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

సహజ వాయు నియంత్రణ, ఎల్పీజీ నియంత్రణ ఉత్తర్వులతో సహా ప్రభుత్వ ఉత్తర్వులను సంక్షోభాన్ని సూచించే అత్యవసర ప్రకటనలుగా చిత్రీకరిస్తూ కొన్ని పోస్టులు దురుద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నాయి. వాస్తవానికి ఇవి ముందు జాగ్రత్తగా, సరఫరా ప్రాధాన్యాలను క్రమబద్ధీకరించేందుకు జారీ చేసిన సాధారణ పరిపాలనా ఉత్తర్వులు.

దుండగులు ప్రచారం చేస్తున్న ఈ అసత్య సమాచారం ప్రజల్లో అనవసరమైన ఆందోళనలకు కారణమవుతోంది. ఇంధనం, గ్యాస్ లభ్యతకు సంబంధించిన సమాచారం కోసం అధికారిక ప్రభుత్వ సమాచార వ్యవస్థలపైనే ఆధారపడాలని పౌరులకు మంత్రిత్వ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. నిత్యావసర వస్తువులకు సంబంధించిన బూటకపు సమాచారాన్ని ప్రచారం చేయడం చట్టరీత్యా నేరం. కావాలనే ఆందోళనలకు కారణమయ్యే వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం ఏ మాత్రం వెనకాడదు.

# తిరుమలలో ఘనంగా శ్రీరామచంద్ర స్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం



తిరుపతి, మార్చి 27: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుమల లోనిశ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్ర స్వామి ఉత్సవ మూర్తులకు, స్నపన తిరుమంజనం నిర్వహించారు.

శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలోని ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులకు కన్నుల పండుగగా స్నపన తిరుమంజనం జరిగింది.

ఈ సందర్భంగా వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

తిరుమల పెద్ద జీయర్ స్వామి, టీటీడీ ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చిమన్‌పల్లిలో పిచ్చికుక్క దాడి.. పలువురికి గాయాలు

నిజామాబాద్, మార్చి 27: పిచ్చికుక్క దాడిలో పలువురు గాయాలపాలైన ఘటన సిరికొండ మండలంలో ని చిమన్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పిచ్చికుక్క వీధిలో తిరుగుతూ కనబడిన వారిపై దాడి చేసి గాయపరిచింది.

ఈ ఘటనలో రాయికంటి లింబాద్రి, కట్కం ప్రసాద్, నిషాన్ తో పాటు ఇంటి బయట ఆడుకుంటున్న ఏనుగు సిద్ధార్థ రెడ్డి అనే బాలుడిని గాయపరిచింది.

మాలధారణలో ఉన్న లింబాద్రి చేతిపై గాయపరిచింది. హనుమాన్ మందిరం నుండి ఇంటికి వస్తున్న ప్రసాద్‌పై ఒక్కసారిగా దాడి చేసింది.

కుక్క కాటుకు గురైన వారిని స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సిద్ధార్థ రెడ్డిని వారం రోజుల పాటు ఆసుపత్రి లో ఉండాలని డాక్టర్లు సూచించారు.

# శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న గద్దె అనురాధ

## -రామరాజ్యం స్ఫూర్తితో ప్రజలకు మేలు జరగాలని ఆకాంక్ష



అమరావతి, మార్చి 27:నగరం లోని 8వ డివిజన్ శ్రీరామ్ నగర్‌లో ఘనంగా నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పందిరిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ, శ్రీరాముడు భారతీయ సంస్కృతిలో ధర్మానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. రాముని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన పాలన రామరాజ్యం ప్రజలకు న్యాయం, సమానత్వం, శాంతి, సుసంపన్నతకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.

అలాగే శ్రీరాముని దయ కటాక్షాలు రాష్ట్రంపై ఉండి, ప్రజలకు మేలు చేసే విధంగా చంద్రన్న పాలన కొనసాగాలని ఆకాంక్షించారు. రామరాజ్యం స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తూ, ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా పాలన సాగిస్తుందని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో కూడా రాముని ఆలోచనలు, విలువలు అనుసరించడం అత్యంత అవసరమని ఆమె చెప్పారు. ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పాలన కొనసాగాలని, రాష్ట్రం మొత్తం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రతి ఇంటా సుఖశాంతులు నెలకొనాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని ఆమె ప్రార్థించారు.

# రైలు ప్రయాణికుల భద్రత, రక్షణే ప్రథమ ప్రాధాన్యం

న్యూఢిల్లీ, మార్చి 27:రైల్వే ఆస్తుల్ని కాపాడే బాధ్యతను రైల్వే పరిరక్షక దళానికి (ఆర్‌పీఎఫ్) అప్పగించారు. దొంగతనం, దుర్వినియోగానికి పాల్పడడం, దుష్ప్రేరేపణ, కుమ్మక్కు కావడం, కుట్ర వంటి వాటిపై రైల్వే ఆస్తి (చట్టవిరుద్ధ కబ్జా) చట్టం-1966 నిబంధనల్లో భాగంగా కేసులను నమోదు చేసేందుకు ఆర్‌పీఎఫ్‌కు అధికారాలు ఉన్నాయి. దోషులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేసిన తరువాత, సాధికార న్యాయస్థానం... అంటే ఈ సందర్భంలో ప్రత్యేక రైల్వే మేజిస్ట్రేట్ కోర్టులోనూ, ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయని కొన్ని రాష్ట్రాల్లోనూ.. ఫిర్యాదులను దాఖలు చేసి విచారణ జరుపుతున్నారు. గత అయిదు సంవత్సరాల్లో (2021-2025 మధ్య కాలం లో), మొత్తం 52,494 మందిని ఆర్‌పీ (యూపీ) చట్టం-1966 నిబంధనల్లో భాగంగా అరెస్టు చేశారు. వీరిలో 50,432 మంది దోషులపై సంబంధిత న్యాయస్థానాల్లో ఫిర్యాదులను దాఖలు చేశారు.

గత అయిదు సంవత్సరాల్లో (2021-2025 మధ్య కాలం లో), రాళ్లు రువ్విన ఘటనలు మొత్తం 12,157 నమోదయ్యాయి. వాటిలో 8,441 మందిని ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీలు అరెస్టు చేశాయి. గత అయిదు సంవత్సరాల్లో (2021-2025 మధ్య కాలం లో), భారతీయ రైల్వేల్లో ఆకతాయి చేష్టల కారణంగా రైలు పట్టాలు తప్పిన ఘటనలు కేవలం మూడు చోటు చేసుకున్నాయి. ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజన్, నార్త్ సెంట్రల్ రైల్వేలోని ఝాన్సీ డివిజన్, సదరన్ రైల్వే లోని చెన్నై డివిజన్లలో ఇలాంటి ఒక్కొక్క ఘటన నమోదైంది.

దీనికి తోడు, రైలు పట్టాలకు సంబంధించి ఏ విధమైన నేరపూర్వక కార్యకలాపాలకైనా పాల్పడే ఘటనల్ని నిరోధించడానికి ఈ కింద పేర్కొన్న చర్యలను రైల్వేలు తీసుకుంటున్నాయి:-

రైల్వేలకు చెందిన రాష్ట్ర స్థాయి భద్రతా సంఘం (ఎస్ఎల్ఎస్‌సీఆర్) సమావేశాలను క్రమం తప్పక నిర్వహిస్తున్నారు. ఈ కమిటీలను ప్రతి ఒక్క రాష్ట్రంలో సంబంధిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలు, పోలీస్ కమిషనర్ల అధ్యక్షతన ఏర్పాటు చేశారు. వీటిలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, ఇంటెలిజెన్స్ యూనిట్ల ప్రతినిధులకు స్థానం కల్పించారు. దీనికి అదనంగా, విద్రోహ ఘటనలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ నేరాల నియంత్రణ, కేసులు నమోదు చేయడం, వాటిపై దర్యాప్తు, రైళ్లను సురక్షితంగా నడిపేటట్లు చూడటానికి గోప్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికీ రాష్ట్ర పోలీసు, జీఆర్‌పీ ప్రాధికార సంస్థలతో కలిసి అన్ని స్థాయుల్లో సన్నిహిత సమన్వయాన్ని నెలకొల్పు కొన్నారు. రహస్య సమాచారాన్ని సేకరించడానికి కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఏజెన్సీలకు తోడు ఆర్‌పీఎఫ్ ఇంటెలిజెన్స్ విభాగమైన క్రైమ్ ఇంటెలిజెన్స్ బ్రాంచి (సీఐబీ), స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి (ఎస్ఐబీ)ని రంగంలోకి దించారు.

ఈ విధమైన రహస్య సమాచారం ఏవైనా నేర కార్యకలాపాలను గుర్తించి, అడ్డుకోవడానికి సంబంధిత ప్రాధికార సంస్థలతో కలిసి అవసరమైన చర్యలు చేపట్టడానికి దోహదపడుతుంది. గుర్తించిన బ్లాక్ స్పాట్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో రైల్వేలు, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీలతో పాటు పోలీసు శాఖ తరచుగా గస్తీని నిర్వహిస్తున్నాయి.

రైలు పట్టాల దగ్గర్లో పడేసిన సామగ్రిని రైలు మార్గానికి అడ్డంకులను సృష్టించడానికి ఆకతాయిలు ఉపయోగించే ప్రమాదం పొంచి ఉండడంతో ఆ సామగ్రిని తొలగించే ప్రయత్నాలు చేపడుతున్నారు.

పట్టాలపై ఎలాంటి వస్తువులు పెట్టినా, రైలు పట్టాలకు సంబంధించిన భాగాలను తొలగించినా, రీళ్ల చిత్రీకరించడం వంటి పనులు చేసినా ఎలాంటి పర్యవసానాలు కలుగుతాయో రైల్వే పట్టాల చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వారికి తెలియజేస్తున్నారు. అప్రమత్తంగా ఉంటూ ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు జరిగితే వెంటనే సమాచారాన్ని అందించాల్సిందిగా కూడా వారికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పర్యవేక్షణ కోసం డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. అలాగే సౌర శక్తితో పని చేసే స్టాండ్ అలోన్ సీసీటీవీ కెమెరాలను కూడా అమరుస్తున్నారు. ఈ సమాచారాన్ని బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు కేంద్ర రైల్వేలు, సమాచార, ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ సమాధానమిచ్చారు.

# తిరుమల వేంకటేశ్వర ప్రాణాదాన ట్రస్టుకు రూ.కోటి విరాళం అందజేత

తిరుపతి, మార్చి 27: ది చెన్నై షాపింగ్ మాల్ అధినేత మర్రి వెంకటరెడ్డి మర్రి రిటైల్ లిమిటెడ్ సంస్థ పేరిట టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.కోటిని విరాళంగా అందించారు. ఈ మేరకు టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు.

అదేవిధంగా శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు పలువురు దాతలు రూ.60 లక్షలు విరాళంగా అందించారు. చెన్నైకు చెందిన రేవతి విశ్వనాథ్ రూ.40 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన భవేశ్ చౌదరి రూ.10,07,777 విరాళంగా అందించారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పొనకల నాగేంద్ర రావు రూ.10 లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు దాతలు తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.

# శ్రీరాముడి జీవితం ఆదర్శప్రాయం-ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



హైదరాబాద్, మార్చి 27: శ్రీరాముడి జీవితం ఆదర్శప్రాయం అని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి, నామాలగుండు తదితర ప్రాంతాలలో సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులు సన్మార్గంలో జీవించాల్సిన తీరుతెన్నులను శ్రీరాముడు చాటి చెప్పారన్నారు. ఆయన ఆశీస్సులు అందరికి ఉండాలని పద్మారావుగౌడ్ ఆకాంక్షించారు.

ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీసీతారాముల వివాహమహోత్సవాన్ని కన్నుల పండువుగా జరుపుకుంటారని, వివాహ వ్యవస్థను ఆచారయోగ్యంగా ప్రపంచ దేశాలే గుర్తించాయని కొనియడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత రామేశ్వర్‌గౌడ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలో ఫిబ్రవరి మధ్య కాలం నుంచి ఇప్పటి వరకు కల్తీ పాలు తాగి 16 మంది మృతి చెందారన్న వార్తా కథనాన్ని సుమోటోగా తీసుకున్న భారత ఎన్‌హెచ్‌ఆర్‌సీ

అమరావతి, మార్చి 27:ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా లాలాచెరువు, చౌడేశ్వరీ నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లో కల్తీ పాలు తాగటం వల్ల ఫిబ్రవరి మధ్య నుంచి ఇప్పటి వరకు 16 మంది మరణించినట్లు మీడియాలో వచ్చిన వార్తా కథనాలను భారత జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్వీకరించింది.

మీడియా కథనం ప్రకారం.. ఒకే లక్షణాలతో బాధపడుతున్న నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పాలల్లో విషపూరిత రసాయనమైన ఇథిలీన్ గ్లైకాల్‌ను కలవటం వల్ల శరీరంలోని పలు అవయవాల పనితీరు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. నర్సాపురం గ్రామంలోని ఒక డెయిరీలో ఈ కల్తీ జరగ్గా.. ఆ డెయిరీ ద్వారా పరిసర ప్రాంతాల్లోని దాదాపు 100 ఇళ్లకు పాల సరఫరా అవుతాయి.

వార్త కథనంలోని అంశాలు నిజమైతే, బాధితుల మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లేనని కమిషన్ తెలిపింది.

రెండు వారాల్లోగా ఈ ఘటనపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. బాధితుల ఆరోగ్య పరిస్థితి, దర్యాప్తు వివరాలు, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం చెల్లించి ఉంటే, వాటి వివరాలను నివేదికలో పొందుపరచాలని కమిషన్ ఆదేశించింది.

మార్చి 23, 2026 నాటి మీడియా నివేదిక ప్రకారం.. ఫిబ్రవరి నెల మధ్య కాలంలో ప్రజలు అనారోగ్యం బారిన పడినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో బాధితులు కడుపునొప్పి, వాంతులు, మూత్రం రాకపోవటం, మూత్రపిండాల పనితీరులో లోపం వంటి ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. బాధితుల్లో ఎక్కువ మంది వృద్ధులు, చిన్న పిల్లలే ఉన్నారు.

# వరంగల్ రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

వరంగల్, మార్చి 27: కాజీపేట?వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. గురువారం రాత్రి ఐ.ఔని. 374/22-24 డౌన్ లైన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.

జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35-40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ట్రైన్ నం. 20806 ఏపీ ఎక్స్‌ప్రెస్ కిందపడి మృతి చెందాడు. రైలు కింద పడటంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

మృతుడు క్రీమ్ కలర్ ఫార్మల్ ప్యాంట్, యాష్ ఒ బ్లూ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. సుమారు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, ఎరుపు వర్ణం, నల్లని తల వెంట్రుకలు, గడ్డం, మీసాలు కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుడి చేతి పైన "ఏజీటష్ట్రజీలఎజీఎ" అనే ఇంగ్లీష్ పచ్చబొట్టు తప్పా మరే ఇతర ఆధారాలు లభించలేదు.

# రహదారుల నిర్మాణంలో పారిశ్రామిక వ్యర్థాల వినియోగం..

## భారత సర్క్యులర్ ఎకానమీ దార్శనికతకు కీలకం:డాక్టర్ ఎన్ కలైసెల్వి

న్యూఢిల్లీ, మార్చి 27:సుస్థిర మౌలిక సదుపాయాలు, సర్క్యులర్ ఎకానమీ (వనరుల పునర్విని యోగ ఆర్థిక వ్యవస్థ) పద్ధతులను ప్రోత్సహించడంలో భాగంగా సీఎస్ఐఆర్-సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఐఎస్ఆర్-సీఆర్ఆర్ఐ) ఒక కీలకమైన ముందడుగు వేసింది. వ్యర్థ ఫౌండ్రీ ఇసుకను రహదారుల నిర్మాణంలో సమర్థవంతంగా వినియోగించుకునే ప్రయత్నాలకు ఈ సంస్థ నాయకత్వం వహిస్తోంది.

ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఫౌండ్రీమెన్ (ఐఐఎఫ్), సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ, సుయోగ్ ఎలిమెంట్స్ మధ్య ఒక ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి ఒప్పందం కుదిరింది. డీఎస్ఐఆర్ కార్యదర్శి, సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్ కలైసెల్వి సమక్షంలో న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్ సైన్స్ సెంటర్‌లో ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. కోయంబత్తూరు విభాగం నుంచి వెలువడే ఫౌండ్రీ వ్యర్థాలను రహదారి మౌలిక సదుపాయాలలో వినియోగించేందుకు వినూత్నమైన, సుస్థిరమైన, భారీ స్థాయిలో అమలు చేయగల పరిష్కారాలను అభివృద్ధి చేయడం ఈ భాగస్వామ్య లక్ష్యం.

ఈ కార్యక్రమంలో డాక్టర్ కలైసెల్వి ప్రసంగిస్తూ ఇలా అన్నారు. "రహదారుల నిర్మాణంలో వ్యర్థ ఫౌండ్రీ ఇసుక వంటి పారిశ్రామిక ఉపఉత్పత్తులను ఉపయోగించడం సుస్థిర అభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీపై సీఎస్ఐఆర్‌కు ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఇలాంటి ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు, దేశ మౌలిక సదుపాయాల వృద్ధికి తోడ్పడుతూనే, వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చడంలో సహాయపడతాయి." అని తెలిపారు.

లోహపు పోత పరిశ్రమ నుంచి వెలువడే ఈ వ్యర్థ ఫౌండ్రీ ఇసుక భారీ స్థాయిలో ఉత్పత్తి కావడం, పారవేయడం వంటి కారణాల వల్ల పర్యావరణ సవాళ్లను విసురుతోంది. ఈ పదార్థాన్ని రహదారి నిర్మాణంలో వినియోగించడం వల్ల వనరుల సమర్థత, వ్యర్థాల తగ్గింపు, సుస్థిర అభివృద్ధి వంటి జాతీయ ప్రాధాన్యతలకు బలం చేకూరుతుంది.

సీఎస్ఐఆర్-సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీ రవిశేఖర్ మాట్లాడుతూ.. "సుస్థిరమైన, వినూత్నమైన రహదారి సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ ముందంజలో ఉంది. పారిశ్రామిక ఉప ఉత్పత్తులను విలువైన నిర్మాణ సామగ్రిగా మార్చే క్రమంలో వ్యర్థ ఫౌండ్రీ ఇసుకను ఉపయోగించడం అత్యంత కీలకమైన చర్య"గా తెలిపారు.

ఈ సందర్భంగా ఐఐఎఫ్ అధ్యక్షుడు శ్రీ సుశీల్ శర్మ మాట్లాడుతూ .. "కోయంబత్తూర్ ఫౌండ్రీ క్లస్టర్ భారతదేశంలోనే అతి పెద్దది. ఇందులో సుమారు 800 నుంచి 1000 ఫౌండ్రీ యూనిట్లు ఉన్నాయి. ఇవి దేశీయ రంగాలతో పాటు విదేశీ మార్కెట్లకు కూడా లోహపు పోతలు సరఫరా చేస్తున్నాయి. అయితే దీని వల్ల భారీ మొత్తంలో ఫౌండ్రీ ఇసుక వ్యర్థాలను ఉత్పన్నమవుతున్నాయి. వీటిని పారవేయడం, పర్యావరణ నిర్వహణ అనేది ఒక సవాలుగా మారింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఫౌండ్రీ ఇసుకను శాస్త్రీయ పద్ధతిలో రహదారుల నిర్మాణంలో పునర్వినియోగం చేయడం, తద్వారా వ్యర్థాలను విలువైన మౌలిక సదుపాయాల వనరుగా మార్చడం మా ప్రధాన లక్ష్యం" అని తెలిపారు.

ఈ ప్రాజెక్టుకు నాయకత్వం వహిస్తున్న సీఆర్ఆర్ఐ సీనియర్ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త, ఫ్లెక్సిబుల్ పేవ్‌మెంట్ డివిజన్ అధిపతి శ్రీ సతీష్ పాండే మాట్లాడుతూ.. "గ్రీన్ సాండ్, రెసిన్ బాండెడ్ సాండ్ వంటి వివిధ రకాల ఫౌండ్రీ ఇసుకల లక్షణాలను విశ్లేషించడం, అలాగే రహదారి నిర్మాణానికి తగినట్లుగా ప్రత్యేకమైన శుద్ధి, వినియోగ ప్రోటోకాల్‌లను అభివృద్ధి చేయడం వంటి ఒక క్రమబద్ధమైన పరిశోధనా కార్యక్రమాన్ని ఈ భాగస్వామ్యం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఉక్కు వ్యర్థాలతో రోడ్ల తయారీ సాధించిన విజయవంతమైన నమూనాను, ఫౌండ్రీ పరిశ్రమలలోని వ్యర్థాలను సంపదగా మార్చే ప్రక్రియలో కూడా పునరావృతం చేయడమే సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ శాస్త్రీయ ప్రయత్నం అవుతుంది" అని తెలిపారు.

# ఉట్నూర్‌లో ఘనంగా భోగ్ బండార్ పూజలు

ఆదిలాబాద్, మార్చి 27:శ్రీరామనవమి సందర్భంగా, దేశవ్యాప్తంగా ఉన్న లంబాడి గిరిజనులు , శ్రీ జగదాంబ దేవి, శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ (గుడి) మందిరాల యందు భోగ్ బండారు పూజా కార్యక్రమాల్లో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ లోని పాత ఉట్నూర్ ఎన్ ఆర్ నగర్ లో గ్రామ నాయకులు భోగి బండార్ నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి పాడి పంటలు బాగా పండాలని, అందరూ సుఖంగా ఉండాలని మొక్కుతూ , హరిదాస్ చేస్తారు.

అందులో భాగంగా ఈరోజు పౌరా దేవి మరియు దేశవ్యాప్తంగా ఉన్న లంబాడి గిరిజన (గ్రామాలలో) తండాలలో భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో అదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, బంజారా నాయకులు హరిదాస్ జాదవ్ గణేష్ మహారాజ్ ,పవర్ దేవిదాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జాదవ్ రామ్ కిషన్ నాయక్ ,లంబాడి జేఏసీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి భానోత్ జగన్ నాయక్, భానోత్ ఆనంద్ రావు, పవర్ గోవింద్ ,ప్రజాసంఘాల నాయకులు బి .రామారావు, ధారావత్ శ్యామ్ రావు, రాథోడ్ బాపురావు, చవాన్ దేవు, లాల్ సింగ్, నాందేవ్, బానోత్ దేవు రావ్ ,ఆడే విజయ్, రేనా బాయ్, చంద్రకళబాయి, రేణుక బాయి, ఎన్ జెల్ సింగ్, ఎన్ రవి, గంగారం, బంజారాలు పాల్గొన్నారు.

# ఖిల్లా రామాలయానికి రూ.10 కోట్ల అభివృద్ధి



నిజామాబాద్, మార్చి 27: ఖిల్లా రామాలయ అభివృద్ధికి కేంద్ర పథకాలు అందేలా చూస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఖిల్లా రామాలయంలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ?ఆలయ అభివృద్ధి కోసం తాను సంకల్పంతో ఉన్నానని, కేంద్ర సహకారం తీసుకొని 10 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధానంగా ప్రసాద్ స్కీమ్ తో దేశంలోని అనేక ఆలయాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయన్నారు.

అలాగే ఖిల్లా రామాలయ భూములను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి కలిసికట్టుగా ముందుకెళ్లాలన్నారు. రామాలయానికి రోప్ వే తెచ్చేందుకు కూడా తనవతు ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు.రామాయణంతో కుటుంబ విలువలు, గౌరవం, భక్తి ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు.

ప్రధానంగా శ్రీరాముడు ధర్మానికి ప్రతీక?ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు.

యువత ఇప్పటికే ఆధ్యాత్మికం వైపు అడుగులు వేస్తోందని, ఎంతో సంతోషించాల్సిన విషయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కల్పే అర్చనా చిరంజీవి, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, నాయకులు ఇల్లెందుల ప్రభాకర్, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర నగర్‌లో ఘనంగా సీతారాముల కళ్యాణం..



మేడ్చల్, మార్చి 27: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ మేడ్చల్ పట్టణ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు శాస్త్ర యుక్తంగా కళ్యాణాన్ని నిర్వహించి, తీర్థ ప్రసాదాలను పంపించేశారు. కాలనీకి చెందిన పలువురు దంపతులు కళ్యాణం లో పాల్గొన్నారు.

అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణలో పెద్ద ఎత్తున స్థానికులు పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా బీ ఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ చామకూర మహేందర్ రెడ్డి కళ్యాణంలో సీతారాములను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, నర్సింగ్ రావు, శ్రీధర్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కార్పొరేషన్‌కు పది వేల కోట్లు కేటాయించాలి : ఆర్. కృష్ణయ్య



హైదరాబాద్, మార్చి 27: బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు పది వేల కోట్లు కేటాయించి, ప్రతి బీసీ కుటుంబానికి రాయితీ రుణం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రిని ఒక ప్రటనలో కోరారు.

బీసీ బంధు పథకం ప్రవేశపెట్టి పది లక్షల రుణం ఇవ్వాలని, ఆర్థికంగా వెనకబడిన కులాలను ఆదుకోవా లన్నారు. 2024లో బీసీ రుణాల కోసం దరఖాస్తు 6.80 మంది బీసీలకు రుణాలు మంజూరు చేయకుండా పెండింగ్ పెట్టారని, దీంతో కుల వృత్తులు దెబ్బతిం టున్నాయని తెలిపారు.

వృత్తులు కోల్పోతున్న వారికి రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు ఎలాంటి పథకాలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. బీసీ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషన్, 16 బీసీ కులాల ఫెడరేషన్‌లకు రుణాలు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తున్నారని, ఆర్థిక అసమానతలు తగ్గించడానికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న 16 బీసీ కుల ఫెడరేషన్‌లను కార్పొరేషన్‌లుగా మార్చాలని, ప్రతి కార్పొరేషన్‌కు పాలక మండలిని నియమించాలన్నారు.

# కామెరాన్, యౌండేలో ప్రారంభమైన డబ్ల్యూటీవో 14వ మంత్రిత్వస్థాయి సదస్సుకు భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, మార్చి 27:కామెరూన్లోని యౌండేలో ప్రపంచ వాణిజ్య సంస్థ 14వ మంత్రిత్వ స్థాయి సదస్సు 2026 మార్చి 26న ప్రారంభమైంది. కామెరూన్ వాణిజ్య మంత్రి అధ్యక్షతన ప్రారంభ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి డబ్ల్యూటీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ గోజి ఒకంజో-ఇవేలా, డబ్ల్యూటీవో సభ్యదేశాల వాణిజ్య మంత్రులు/ ఉన్నత స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. భారత్ తరపున వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్ ప్రారంభ సమావేశానికి హాజరయ్యారు. మత్స్యరంగంలో రాయితీల ఒప్పందం 2025 సెప్టెంబర్ 15న అమల్లోకి వచ్చిన సందర్భంగా ప్రారంభ సమావేశం అనంతరం చిన్న వేడుక నిర్వహించారు.

ప్రారంభ సమావేశం అనంతరం, డబ్ల్యూటీవో సూత్రాలతో సహా సంస్థాగత అంశాలపై నిర్వహించిన మంత్రిత్వ స్థాయి చర్చల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ప్రసంగించారు. పారదర్శకమైన, సమగ్రమైన, సభ్యదేశాల ఆధారిత ప్రక్రియ ద్వారా డబ్ల్యూటీవోను సంస్కరించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. సమానత్వం, ఏకాభిప్రాయంతో కూడిన నిర్ణయాలు, సమన్యాయమే ప్రధానంగా అభివృద్ధి కేంద్రంగా, సంస్థాగత సూత్రాలను, లక్ష్యాలను బలోపేతం చేసేలా సంస్కరణలు ఉండాలని కోరారు.

ఎంసీ14 సమావేశాల మొదటి రోజు కామెరూన్ ప్రధాన మంత్రి శ్రీ డియోన్ గుంటె జోసెఫ్‌తో శ్రీ గోయల్ సమావేశమయ్యారు. భారత్-కామెరూన్ సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలతో సహా ద్వైపాక్షిక, బహుపాక్షిక అంశాలపై చర్చించారు. ఎంసీ14 అజెండాపై దృష్టి సారిస్తూ.. డబ్ల్యూటీవో డైరెక్టర్ జనరల్‌తో కూడా ద్వైపాక్షిక చర్చలు చేపట్టారు. అలాగే నెదర్లాండ్స్, ఫ్రాన్స్, ఇథియోపియా దేశాల వాణిజ్య మంత్రులతో కూడా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసేలా తమ ఆలోచలను పంచుకున్నారు.

చిలీ, పరాగ్వే, అమెరికా, నేపాల్, ఫిలిప్పీన్స్, సౌదీ అరేబియా, మెక్సికో, పెరూ, రష్యా, న్యూజిలాండ్ ఈయూ దేశాల వాణిజ్య కార్యదర్శులు, ఈయూ పార్లమెంటేరియన్ల ప్రతినిధులతో వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఎంసీ14 అజెండాతో పాటు ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను విస్తరించేందుకు ఉన్న అవకాశాలను అన్వేషించేలా చర్చలు కొనసాగాయి. కొనసాగుతున్న ఇండియా-చిలీ, ఇండియా-పెరూ ఎఫ్‌టీఏల సంప్రదింపులపై చిలీ, పెరూ దేశాలతో ఉభయపక్ష సమీక్షలు జరిగాయి. ఈయూ, న్యూజిలాండ్‌తో ఇటీవలే ఇండియా-ఈయూ ఎఫ్‌టీఏ, ఇండియా-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ సంప్రదింపులు ఇటీవలే పూర్తయిన నేపథ్యంలో సంతకాల దిశగా సాధించిన పురోగతిని సమీక్షించారు.

# హౌరాలో ఈసీఐ భారీ ఎస్‌వీఈఈపీ ప్రచార కార్యక్రమాలు..

## "చునావ్ కా పర్వ్, పశ్చిమ బెంగాల్ కా గర్వ్"

న్యూఢిల్లీ, మార్చి 27: అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరుగుతున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ), జిల్లా ఎన్నికల అధికారుల (డీఈఓ) సమన్వయంతో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్రవ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను ప్రారంభించింది. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రజాస్వామ్య పండుగను ఆనందకరంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం.

ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహిం చడానికి, స్వేచ్ఛాయుత, పారదర్శక, పండుగ వాతావరణంలో ఓటు ప్రక్రియ జరిగేలా చూసేందుకు నేడు హౌరాలో భారీ "వ్యవస్థీకృత ఓటరు అవగాహన, ఎన్నికల్లో పాల్గొనడం" (ఎస్‌వీఈఈపీ) ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లోని అన్ని జిల్లాలలోనూ ఇలాంటి కార్యక్రమాలను చేపట్టారు.

హౌరా జిల్లాలో ఈ కార్యక్రమం ఉత్సాహభరితమైన సైకిల్ ర్యాలీతో ప్రారంభమైంది. ఇందులో ఈసీఐ, సీఈఓ కార్యాలయ అధికారులు, పోలీసు కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి, ఇతర శాఖల అధికారులతోపాటు పాఠశాల, కళాశాల విద్యార్థులు, తొలిసారి ఓటు వేయబోతున్న యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 7:00 గంటలకు హౌరా వంతెన చెక్ పోస్టు వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ.. రైల్ మ్యూజియం మీదుగా సాగి రామకృష్ణాపూర్ ఫెర్రీ ఘాట్ వద్ద ముగిసింది. ర్యాలీ అనంతరం జానపద గీతాలు, నృత్యాలు, నాటకాల ద్వారా ఓటు హక్కు ప్రాముఖ్యతను, ఎన్నికల పండుగ స్ఫూర్తిని వివరించే సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. ఓటరు అవగాహన కోసం నదిలో బోట్ ఫెర్రీ వంటి ఇతర ఎస్‌వీఈఈపీ కార్యక్రమాలను కూడా నిర్వహించారు.

ప్రముఖ యానిమేషన్ పాత్రలైన చోటా భీమ్, చుట్కీలు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువత, తొలిసారి ఓటు వేయబోతున్న వారిలో అవగాహన కల్పించడానికి, ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమంలో ఈ పాత్రలు కూడా పాల్గొన్నాయి.

ఓటు ప్రాముఖ్యత గురించి, ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలను ఎలా గుర్తించాలి? ఎన్నికల రోజు షెడ్యూల్ వంటి ముఖ్యమైన వివరాల గురించి వారిలో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశం. పౌరులు, ఇతర భాగస్వాములలో ఎన్నికల ప్రక్రియపై అవగాహనను బలోపేతం చేయడంతోపాటు పట్టణ ఓటర్లు, మహిళలు, దివ్యాంగులు, యువత, తొలిసారి ఓటు వేసేవారిలో ఓటింగ్ శాతాన్ని అధికంగా పెంచడమే ఈ ప్రయత్నాల లక్ష్యం.

పశ్చిమ బెంగాల్‌లోని గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ఓటరు అవగాహన ప్రచారంలో భాగంగా ఉపయోగించనున్నారు. ఇందులో భాగంగా కాళీఘాట్ చిత్రలేఖనం, పట్టచిత్ర కళ, ఛౌ నృత్యం, జాతర నాటకం, బావుల్ జానపద సంప్రదాయాల ద్వారా ఎన్నికల సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తారు.

ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి, పారదర్శకతను, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయడానికి భారత ఎన్నికల సంఘం ఇటీవల అమలు చేస్తున్న చర్యలను కూడా ఈ కార్యక్రమాలు వివరించాయి. పోలింగ్ కేంద్రాల వెలుపల మొబైల్ ఫోన్లను భద్రపరుచుకునే వసతి, ఎన్నికల సమాచారం కోసం ఈసీఐఎన్ఈటీ యాప్, 100 శాతం వెబ్‌కాస్టింగ్, మెరుగైన ఓటరు సమాచార స్లిప్పులు, ఇతర సహాయక చర్యలు ఇందులో ఉన్నాయి.

తొలిసారి ఓటు వేయబోతున్న వారిని, యువతను ప్రోత్సహించడానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని ఎన్నికల అక్షరాస్యత క్లబ్బులు విద్యార్థుల్లో ఓటరు అవగాహనను పెంపొందిస్తాయి. రాష్ట్రానికి చెందిన సాంస్కృతిక అంశాలను ఉపయోగించి యువతను ఆకట్టుకునేలా, వారిని చైతన్యపరిచేలా సోషల్ మీడియా ద్వారా విస్తృతమైన ప్రచారాన్ని నిర్వహించనున్నారు.

కార్పొరేట్ సంస్థల సహకారంతో ప్రభుత్వ శాఖలు ఈ అవగాహన కార్యక్రమాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాయి.

ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే వారందరూ భయం లేని వాతావరణంలో, ప్రలోభాలకు లోనుకాని విధంగా, పూర్తి అవగాహనతో ఓటు వేసేలా చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యం. "చునావ్ కా పర్వ్, పశ్చిమ బెంగాల్ కా గర్వ్" అనే ప్రధాన నినాదంతో ఎస్‌వీఈఈపీ కార్యక్రమాలన్నీ నిర్వహిస్తున్నారు

# ఇంధనంపై ఎక్సయిజ్ సుంకాన్ని తగ్గించాలన్న మోదీ ప్రభుత్వ నిర్ణయంతో పౌరులకు ఎంతో ఊరట

న్యూఢిల్లీ, మార్చి 27:ఇంధనంపై విధిస్తున్న ఎక్సయిజ్ సుంకంలో కోత పెట్టాలని నిర్ణయించినందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఒక సందేశాన్ని పొందుపరుస్తూ- "పశ్చిమ ఆసియాలో సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఇంధన కొరతతో సతమతం అవుతూ సర్వత్రా ధరలు పెంచుతుంటే, ఇంధనంపై ఎక్సయిజ్ సుంకాన్ని తగ్గించాలన్న మోదీ ప్రభుత్వ నిర్ణయం పౌరులకు గొప్ప ఉపశమనాన్నిచ్చింది. డీజిలు, పెట్రోలు ధరలను అనేక దేశాలు పెంచితే, ఎక్సయిజ్ సుంకాన్ని తగ్గిస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం.. ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యాన్నిస్తూ ఈ ప్రభుత్వం పాలనను కొనసాగిస్తోందనీ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని గమనిస్తూ తదనుగుణమైన నిర్ణయాల్ని తీసుకుంటోందనీ స్పష్టం చేస్తోంది. ఈ నిర్ణయాన్ని తీసుకున్నందుకు ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారిని నేను ప్రశంసిస్తున్నాను" అని పేర్కొన్నారు.

# ఎన్‌సీబీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన సాధ్వి నిరంజన్ జ్యోతి

న్యూఢిల్లీ, మార్చి 27:జాతీయ వెనుకబడిన తరగతుల సంఘం (ఎన్‌సీబీసీ) చైర్‌పర్సన్‌గా సాధ్వి నిరంజన్ జ్యోతి (18 మార్చి 2026 నుంచి ), కమిషన్ సభ్యురాలిగా శ్రీమతి కిరణ్ ఉమేష్ మహల్లే (20 మార్చి 2026 నుంచి) బాధ్యతలు స్వీకరించారు.

సాధ్వి నిరంజన్ జ్యోతి మాజీ పార్లమెంటు సభ్యురాలు. ఆమె గతంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖల్లో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేయడంతోపాటు అనేక ముఖ్య ప్రభుత్వ పదవులను నిర్వహించారు. సమాజంలోని బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రజా జీవితంలో, పాలనలో ఆమెకు ఉన్న విస్తృత అనుభవం, కమిషన్ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంలో దోహదపడుతుందని భావిస్తున్నారు.

శ్రీమతి కిరణ్ ఉమేష్ మహల్లే సామాజిక, సంస్థాగత కార్యకలాపాల్లో అపార అనుభవం కలిగిన ప్రజా ప్రతినిధి. గతంలో అమరావతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పనిచేశారు. ప్రజా జీవితంలో వివిధ ముఖ్యమైన పదవులనూ నిర్వహించారు. మహిళా సాధికారత, సామాజిక సంక్షేమం, క్షేత్ర స్థాయి పాలనకు సంబంధించిన కార్యక్రమాల్లో ఆమె చురుగ్గా వ్యవహరిస్తున్నారు. పలు సహకార, సామాజిక సంస్థలతో ఆమెకున్న అనుబంధం.. సమ్మిళిత అభివృద్ధి పట్ల ఆమెకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది.

కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్, సభ్యురాలికి న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సాదర స్వాగతం పలికింది. దేశవ్యాప్తంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం, రక్షణ, సామాజిక-ఆర్థిక అభివృద్ధి కోసం కమిషన్ చేసే కృషిలో వీరి మార్గదర్శకత్వం, అంకితభావంతో కూడిన సేవలు ఎంతో కీలకమని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## ధర్మానికి ప్రతిరూపం శ్రీరాముడు : సిద్ధేశ్వరానందగిరి

సంగారెడ్డి, మార్చి 27: : శ్రీరాముడు ధర్మానికి ప్రతిరూపమని ప్రజలందరికీ న్యాయం అందించిన ఆదర్శ పురుషుడని బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఝరాసంగం పరిధిలోని బర్దిపూర్, కుప్పా నగర్, ఏడాకులపల్లి తదితర ప్రాంతాల్లో నిర్వహించిన రామనవమి వేడుకల్లో ఆయన పాల్గొని భక్తులకు ప్రవచనాలు అందించారు.

రాజ్య పాలనలోనూ, వనవాసంలోనూ, యుద్ధాల్లోనూ సత్యం, ధర్మం, న్యాయం మార్గాన్నే అనుసరించినవాడే శ్రీరాముడు అని తెలిపారు. రామనామ స్మరణతో మనసుకు ప్రశాంతత కలుగుతుందని, ధర్మ మార్గంలో నడిచే శక్తి లభిస్తుందని అన్నారు.

# పెట్రోల్.. డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి 27: పెట్రోల్, డీజిల్‌లపై లీటరుకు 10 వంతున ఎక్సైజ్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవాళ తగ్గించగా, ఈ నిర్ణయం తక్షణం అమలులోకి వచ్చింది. పశ్చిమాసియా యుద్ధం వల్ల దానితో ముడిపడిన ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడింది. దీంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఒక్కసారిగా, అత్యధిక స్థాయిలో పెరిగిపోయాయి. ఈ మేరకు గత నెలలో 70 డాలర్లుగా ఉన్న బ్యారెల్ ముడిచమురు ధర ప్రస్తుతం 122 డాలర్ల స్థాయికి దూసుకెళ్లింది. అంటే- నాలుగు వారాల్లోగా దాదాపు 75 శాతం పెరిగిపోయిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

అయితే, ఎక్సైజ్ సుంకం తగ్గింపు వల్ల పెట్రోల్, డీజిల్ చిల్లర విక్రయ ధరల్లో మార్పేదీ ఉండదు. అంటే- ఎక్సైజ్ సుంకం కోత పంపుల వద్ద వినియోగదారులకు ధర తగ్గింపుగా ఉండదు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ రంగ చమురు విక్రయ కంపెనీలు (ఓఎంసీ): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్లకు వాటిల్లే నష్టం నుంచి ప్రత్యక్ష ఉపశమనం లభిస్తుంది. 'ఓఎంసీ'లు ఇప్పటికే తమ సరఫరా వ్యయంకన్నా చాలా తక్కువ ధరతో వినియోగ దారులకు ఇంధన సరఫరా చేస్తున్నాయి. అంటే- ప్రస్తుత అంతర్జాతీయ ముడిచమురు ధరల ప్రకారం, పెట్రోల్‌పై లీటరుకు సుమారు 26, డీజిల్‌పై 81.90 వంతున నష్టపోతున్నాయి. ఈ నష్టం రోజువారీగా దాదాపు ?2,400 కోట్లు కాగా, ఎక్సైజ్ సుంకం తగ్గింపుతో ఈ నష్టం లీటరుకు ?10 చొప్పున భర్తీ అవుతుంది. తద్వారా ఈ రెండు ఇంధనాల చిల్లర విక్రయ ధర యథాతథంగా ఉండి, 'ఓంఎసీ'ల నుంచి నిరంతరాయ ఇంధన సరఫరాకు భరోసా లభిస్తుంది.

ఈ పరిణామాన్ని ప్రపంచ ఇంధన మార్కెట్లతో పోల్చి చూస్తే మనకు ఒక అవగాహన కలుగుతుంది. ప్రస్తుత సంక్షోభం ఆరంభమైనప్పటి నుంచి దక్షిణ-ఆగ్నేయాసియా దేశాల్లో 30 నుంచి 50 శాతం, ఉత్తర అమెరికాలో 30 శాతం, ఐరోపాలో 20 శాతం వంతున ఇంధన ధరలు పెరిగాయి. కానీ, భారత ప్రభుత్వం మాత్రం ఈ అదనపు వ్యయ భారాన్ని ఆర్థికంగా తానే భరిస్తూ ధరల స్థిరత్వాన్ని కొనసాగించాలని నిర్ణయించింది.

పెట్రోలియం-సహజ వాయువుల శాఖ మంత్రి శ్రీ హర్‌దీప్ సింగ్ పూరి కింది విధంగా ప్రకటించారు.

"ప్రస్తుత సంక్షోభ సమయంలో ప్రభుత్వం ముందున్న మార్గాలు రెండు: ఒకటి... ఇతర దేశాల తరహాలో భారత్‌లోనూ విపరీతంగా ధరల పెంపు. రెండోది... అంతర్జాతీయ అనిశ్చితి నుంచి దేశ పౌరులకు రక్షణ దిశగా ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరించడం. ఈ నేపథ్యంలో గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశ ప్రజల ప్రయోజనం పరిరక్షణకే ప్రాధాన్యమిచ్చారు. తదనుగుణంగా అంతర్జాతీయ ముడిచమురు ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ అధిక నష్టాల నుంచి 'ఓంఎసీ'లకు ఉపశకమనం కల్పిస్తూ ప్రభుత్వం తన పన్నుల రాబడి మీద గణనీయ భారం మోపింది."

ఈ మేరకు ప్రభుత్వం ఒకవైపు ఎక్సైజ్ సుంకం తగ్గిస్తూ, మరోవైపు డీజిల్‌పై ఎగుమతి సుంకం విధించింది. అంతర్జాతీయంగా డీజిల్ ధర విపరీతంగా పెరిగినందు వల్ల ఈ ఇంధన ఎగుమతిని నిరుత్సాహపరచేలా ఈ నిర్ణయం తీసుకుంది. తద్వారా రిఫైనరీలలో డీజిల్ ఉత్పత్తి తొలుత దేశీయ అవసరాలు తీర్చడానికి మళ్లించే విధంగా జాగ్రత్త వహించింది. ప్రస్తుత అంతర్జాతీయ ధరలు వాణిజ్యపరంగా ఎగుమతులను ఆకర్షించేవిగా ఉన్నప్పటికీ, దేశంలో చిల్లర విక్రయాల నిమిత్తం పూర్తిస్థాయి సరఫరా కొనసాగించడానికే ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది.

రష్యా-ఉక్రెయిన్ల మధ్య యుద్ధం అనంతరం 2022లో అనుసరించిన విధానం తరహాలోనే ప్రస్తుత నిర్ణయం తీసుకుంది. ఆనాడు 'ఓఎంసీ'లు నిరంతర నష్టాలు భరించగా, ప్రపంచ ధరల అనిశ్చితి నుంచి గృహాలకు, వ్యాపారాలకు రక్షణనిస్తూ కేంద్ర ప్రభుత్వం తన పన్నులను తగ్గించింది. ప్రస్తుత సందర్భంలోనూ అదే సూత్రం ప్రకారం ఎక్సైజ్ సుంకం తగ్గించింది. తమ ప్రమేయం లేని ప్రపంచ స్థితిగతుల దుష్పరిణామాల భారాన్ని దేశ పౌరులు, పరిశ్రమలపై మోపరాదని నిశ్చయించుకుంది. మరోవైపు నానాటికీ మారుతున్న ప్రపంచ ఇంధన పరిస్థితిని పర్యవేక్షిస్తూ, వినియోగదారుల కోసం సరఫరా, ధరల స్థిరత్వం కొనసాగే విధంగా అవసరమైన చర్యలన్నీ చేపడుతుంది.

# మార్కాపురం దుర్ఘటనలో బస్సు డ్రైవర్ అరెస్ట్.. క్షతగాత్రులను పరామర్శించిన మంత్రులు

అమరావతి, మార్చి 27: ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా రాయవరం పట్టణ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పరారీలో ఉన్న బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు జిల్లా కలిగిరిలో హరికృష్ణ ట్రావెల్స్ నడుపుతున్న హరికృష్ణా రెడ్డి యజమానిగా ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

బుధవారం లారీ ట్రక్కును బస్సు ఢీ కొన్న ఘటనలో మొత్తం 14 మంది సజీవదహనం కాగా మరో 12 మంది వరకు గాయాలతో ఆసుపత్రుల పాలైన విషయం తెలిసిందే. బస్సు ఘటన జరుగగానే అక్కడి నుంచి పారిపోయిన డ్రైవర్ హరికృషా రెడ్డిని శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఏపీ మంత్రులు గొట్టిపాటి రవి, డోలా బాల వీరాంజనేయ స్వామి పరామర్శించారు.

బాధితులు పూర్తిగా కోలుకుని ఇళ్లకు చేరే వరకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. రోడ్ల వెడల్పు చేయడంతో వాహనాలు వేగంగా వెళ్తున్నాయని, వాహనాల వేగాన్ని నియంత్రించాలని అభిప్రాయపడ్డారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. తొమ్మిది మంది అరెస్ట్

హైదరాబాద్, మార్చి 27: మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్‌లో టాస్క్ ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. 9మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని తొమ్మిది సెల్ ఫోన్లు, రూ.45,000 డబ్బులను సీజ్ చేసి మైలార్ దేవ్ పల్లి పోలీసులకు అప్పగించారు.

కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. యువత పేకాట, డ్రగ్స్ వంటి దురాగాతాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# తాండూర్‌లో ఘనంగా రాములోరి కల్యాణం



ఆదిలాబాద్, మార్చి 27:మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలో శుక్రవారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆయా దేవాలయాలలో కల్యాణ మహోత్సవ వేడుకలను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. కల్యాణమహోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఆలయ కమిటీ నిర్వాహకులు, హనుమాన్ మాలా దీక్షదారులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, యూత్ మండలీల సభ్యులు శ్రీరాముని ప్రతిమ, జెండాలు చేతబూని వాహనాల ర్యాలీతో, పల్లకి సేవలతో కలిసి భారీ శోభాయాత్ర నిర్వహించారు. ప్రజలు కల్యాణ మహోత్సవాలలో పాల్గొని పూజలు నిర్వహించారు.

కల్యాణ మహోత్సవానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, బెల్లం పాణకం, వడపప్పు వితరణ చేశారు.

# మహిళల రక్షణ, భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలను అమలు చేయడానికి నిర్భయ నిధిని ఏర్పాటు చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి 27:దేశ రాజధానితో సహా ఇతర మెట్రోపాలిటన్ నగరాల్లో వ్యభిచారంలోకి మళ్లుతున్న, భిక్షాటన చేస్తున్న మహిళల సంఖ్యపై మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎలాంటి కేంద్రీకృత సమాచారాన్ని నిర్వహించడం లేదు.

భారత రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం 'పోలీసు', 'శాంతి భద్రతలు' రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలు. శాంతి భద్రతల నిర్వహణ, పౌరుల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించడం, మహిళలపై జరిగే నేరాలను దర్యాప్తు చేయడం, విచారించడం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంత పరిపాలనా వ్యవస్థల పరిధిలో ఉంటాయి. అమలవుతున్న చట్టాల పరిధిలోని నిబంధనల ప్రకారం ఇలాంటి నేరాలను అదుపు చేయడానికి వాటికి అధికారం ఉంది. అక్రమ రవాణా, వ్యాపారపరమైన లైంగిక దోపిడీ, సంబంధిత నేరాలను అరికట్టడానికి అక్రమ రవాణా (నివారణ) చట్టం - 1956 (ఐటీపీఏ)ను భారత ప్రభుత్వం రూపొందించింది. ఈ చట్టం వ్యభిచారాన్ని వ్యాపారపరమైన లైంగిక దోపిడీగా నిర్వచిస్తుంది. ఇలాంటి దోపిడీకి సహకరించే, ప్రోత్సహించే లేదా లాభం పొందే వారికి విధించే శిక్షలను సూచిస్తుంది. ఈ చట్టాన్ని ప్రాథమికంగా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలనా వ్యవస్థలపై ఉంది.

దేశవ్యాప్తంగా మహిళల రక్షణ, భద్రత, సాధికారత కోసం చేసే ప్రయత్నాలను బలోపేతం చేసే లక్ష్యంతో 'మిషన్ శక్తి' పథకాన్ని మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎండబ్ల్యూసీడీ) అమలు చేస్తోంది. మిషన్ శక్తిలో రెండు భాగాలు ఉన్నాయి. మహిళల భద్రత, రక్షణ కోసం 'సంబల్'. మహిళా సాధికారత కోసం 'సామర్థ్య'. ఇంటా బయటా హింసకు గురై ఒత్తిడిలో ఉన్న మహిళలకు అవసరమైన మద్దతును, సాయాన్ని సంబల్ పరిధిలో ఉండే వన్ స్టాప్ సెంటర్లు (ఓఎస్‌సీ) అందిస్తాయి. వైద్యపరమైన, న్యాయపరమైన సహాయాన్ని, సలహాలను, తాత్కాలిక ఆశ్రయాన్ని, పోలీసు సాయాన్ని, మానసిక-సామాజిక కౌన్సెలింగ్‌తో సహా అనేక సేవలను అందిస్తాయి. అదేవిధంగా, సంబల్ పరిధిలో ఏర్పాటు చేసిన మహిళా హెల్ప్ లైన్ (డబ్ల్యూహెచ్‌ఎల్).. 181 నెంబరు ద్వారా మహిళలకు ఏడాది పొడవునా రోజుకి 24 గంటలూ అత్యవసర, అత్యవసరం కాని సేవలను అందిస్తుంది. ఇది మహిళలను పోలీస్, వన్ స్టాప్ సెంటర్లు, ఆసుపత్రులు, న్యాయ సేవా అధికార సంస్థలు లాంటి తగిన విభాగాలతో అనుసంధానిస్తుంది. అదనంగా, మహిళా సంక్షేమ పథకాలు, కార్యక్రమాల గురించి సమాచారాన్ని కూడా అందిస్తుంది. 35 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మహిళా హెల్ప్ లైన్ పనిచేస్తోంది. దీనిని ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ (ఈఆర్ఎస్ఎస్-112)తో కూడా ఏకీకృతం చేశారు. అక్రమ రవాణాకు గురయిన వారితో సహా దుర్భర పరిస్థితుల్లో చిక్కుకున్న మహిళలకు ఉపశమనం, పునరావాస సేవలను సామర్థ్య పరిధిలో నిర్వహించే శక్తి సదన్ అందిస్తుంది. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న మహిళలకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణాన్ని అందించి, తమకెదురైన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేలా చేయడమే దీని లక్ష్యం. సేవా పంపిణీలో పారదర్శకతను, సౌలభ్యాన్ని బలోపేతం చేసేందుకు ఎండబ్ల్యూసీడీ 22.01.2025న మిషన్ శక్తి డ్యాష్ బోర్డును ప్రారంభించింది. ఈ డ్యాష్ బోర్డులో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు (ఏహెచ్‌టీయూలు), ఓఎస్సీలు, డబ్ల్యూహెచ్‌ఎల్, శక్తి సదన్ తదితర పథకాల నోడల్ అధికారులు తాజా జాబితాలు అందుబాటులో ఉంటాయి. ప్రజల సౌలభ్యం కోసం అన్ని ప్రధాన హెల్ప్‌లైన్లను ఈ పోర్టల్ ఒకే చోట అందిస్తుంది. మిషన్ శక్తి డాష్‌బోర్డ్ సమాచారాన్ని మిషన్ శక్తి మొబైల్ అప్లికేషన్ ద్వారా కూడా పొందవచ్చు. ఇప్పుడు పోర్టల్, మొబైల్ అప్లికేషన్ ద్వారా ఇబ్బందుల్లో ఉన్న మహిళ తనకు దగ్గరలో ఉన్న ఓఎస్సీలో అపాయింట్మెంట్ బుక్ చేసుకోవచ్చు.

మహిళల భద్రత, రక్షణను బలోపేతం చేయడమే లక్ష్యంగా అమలు చేస్తున్న కార్యక్రమాల అమలు కోసం 'నిర్భయ నిధి' పేరుతో ప్రత్యేక నిధిని భారత ప్రభుతు?వం ఏర్పాటు చేసింది. అవసరానికి అనుగుణంగా నిర్భయ నిధి పరిధిలో అన్ని ప్రాజెక్టులు/పథకాలు అమలవుతాయి. ఈ నిధి వివిధ పథకాల అమలుకు మంత్రిత్వ శాఖలు, విభాగాలు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆర్థిక సాయం అందిస్తుంది. వాటిలో ఈఆర్ఎస్ఎస్-112, మహిళలు, చిన్నారులపై సైబర్ నేరాల నివారణ (సీసీపీడబ్ల్యూసీ) ఉన్నాయి. వీటితో పాటు ఎనిమిది నగరాలు - అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, లక్నో, ముంబయిలో చేపడుతున్న సేఫ్ సిటీ ప్రాజెక్టు, పోలీసు స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్కులు (డబ్ల్యూహెచ్‌డీలు), యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ)లకు కూడా నిధులు అందిస్తుంది. అలాగే రాష్ట్రాల ఫోరెన్సిక్ ల్యాబరేటరీ (ఎస్ఎఫ్ఎస్ఎల్)ల్లో డీఎన్ఏ విశ్లేషణ, సైబర్ ఫోరెన్సిక్, తదితర వసతులను బలోపేతం చేయడానికి, అత్యాచార, పోక్సో సహా ఇతర చట్టాల పరిధిలో విచారణలో ఉన్న కేసులను పరిష్కరించడానికి ప్రత్యేక పోక్సో కోర్టులతో పాటుగా ప్రత్యేక ఫాస్ట్ ట్రాకు కోర్టు (ఎఫ్‌టీఎస్సీ)లను ఏర్పాటు చేయడానికి కూడా ఆర్థిక సహకారం అందిస్తుంది.కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీమతి సావిత్రీ ఠాకూర్ ఈ సమాచారాన్ని లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా అందించారు.

# పెళ్లి వేడుకలో విషాదం.

- తుంగభద్రలో ఈతకు వెళ్లి నలుగురు మృతి.
-ఆనందం మధ్య దుర్ఘటన?
-.శ్రీరామనవమి రోజున కుటుంబాల్లో కన్నీటి వర్షం.



కర్నూలు మార్చి 27: కర్నూలు జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లిన నలుగురు మునిగి మృతి చెందడం కలకలం రేపింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర శోకం నెలకొంది. జిల్లాలోని మంత్రాలయం నియోజకవర్గం పరిధిలోని కోసిగి మండలం అగసనూరు గ్రామం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం, కర్ణాటక రాష్ట్రంలోని కురుడి గ్రామానికి చెందిన 15 మంది బంధువుల ఇంట్లో పెళ్లి కార్యక్రమానికి హాజరయ్యేందుకు కందుకూరుకు వచ్చారు. ఈ క్రమంలో వారిలో నలుగురు సరదాగా తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు.

మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. వీరిలో దాసరి రత్నమ్మ, దాసరి ఉమాపతి అలియా సంగీత, శివానంద, మహన్తేష్ లు మృతి చెందిన వారిలో ఉండటం గమనార్హం. మృతులంతా ఒకే గ్రామానికి చెందినవారే కావడం కుటుంబాలను మరింత దుఃఖంలో ముంచింది.

పండుగ రోజు విషాదం

ఒకవైపు బంధువుల ఇంట్లో పెళ్లి నంబరాలు జరుగుతుండగా, మరోవైపు శ్రీరామనవమి రోజున ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా విషాద వాతావరణాన్ని సృష్టించింది. ఆనందకర వేడుక క్షణాల్లోనే కన్నీటి ఘడియగా మారింది. ప్రమాదానికి కారణాలపై అనుమానాల ప్రాథమికంగా నది ప్రవాహం తీవ్రంగా ఉండడం, లోతు అంచనా వేయక పోవడం, ఈతలో అనుభవం లేకపోవడం వంటి కారణాలు ఈ ప్రమాదానికి దారితీసి ఉండవచ్చని భావిస్తున్నారు. వేసవి కాలంలో నదుల్లో నీటి మట్టం మారుతూ ఉండటంతో ఇలాంటి ప్రమాదాలు పెరుగుతున్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను వెలికితీసి పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇటీవల కాలంలో నదులు, చెరువుల్లో ఈతకు వెళ్లి ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయి. నిపుణుల సూచనల ప్రకారం తెలియని ప్రదేశాల్లో ఈతకు వెళ్లకూడదులోతు, ప్రవాహం గురించి ముందుగా తెలుసుకోవాలి పెద్దల పర్యవేక్షణలో మాత్రమే నీటిలోకి దిగాలి. కర్నూలు జిల్లాలో జరిగిన ఈ ఘటన మరోసారి నీటి మాధ్యమాల్లో జాగ్రత్తల అవసరాన్ని గుర్తు చేసింది. ఆనందంగా ప్రారంభమైన పెళ్లి వేడుక, ఒక్కసారిగా విషాదంలో ముగియడం అందరినీ కలచివేసింది. మృతుల కుటుంబాలకు స్థానికులు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు.

# ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

నల్గొండ, మార్చి 27:శ్రీరామ నవమి వేడుకలు శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరిగాయి. పచ్చని తోరణాలతో శోభాయమానంగా ఆలయాలను అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాలు, భక్తుల జయ జయధ్వానాల మధ్య జగథానుడి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. అభిజిత్ లగ్నం శుభ ముహూర్తాన సీతారాముల వారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో రెండోవ భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించిన కల్యాణ ఘట్టంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. రామగిరిలో కల్యాణోత్సవంలో కలెక్టర్ బి.చంద్రశేఖర్, నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ వై.అశోక్ రెడ్డి, జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి. 43వ డివిజన్ కార్పోరేటర్ కవితా దయాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కూరి రమేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.


## కొత్తగూడెం ఏరియాలో కొత్త జూనియర్ ఇన్‌స్పెక్టర్ల బాధ్యతలు స్వీకారం

నల్గొండ, మార్చి 27: కొత్తగూడెం ఏరియాకు కొత్తగా జూనియర్ ఇన్‌స్పెక్టర్లుగా నియమితులైన టి.కామరాజు, ఎండీ.గౌస్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం వారు ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు, ఎస్ఓ టు జీఎం జీబీ కోటిరెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాషను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు వారికి అభినందనలు తెలియజేస్తూ విధుల్లో సమర్థవంతంగా పని చేయాలని ఆకాంక్షించారు.

# రాజన్న సన్నిధిలో కన్నులపండువగా శ్రీ సీతారాముల కళ్యాణం

**వైభవంగా ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు**
**కళ్యాణంకు పోటెత్తిన భక్తజనం**
**అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం**
**శ్రీరామ నామ స్మరణతో మార్మోగిన వేములవాడ**
**రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ**
**సాయంత్రం ఆకట్టుకున్న రథోత్సవం, డోలోత్సవం**

రాజన్న సిరిసిల్ల, మార్చి 27: నేటినిజం (ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామచంద్ర స్వామివారి



కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాన్ స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అలాగే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పంపిన పట్టువస్త్రాలను కూడా ఆలయ అధికారులకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ప్రతాప్ రామకృష్ణ అందజేశారు. మున్సిపల్ తరుపున చైర్మన్ పుల్కం రాజు పట్టువస్త్రాలు సమర్పించారు. శివార్చన వేదికపై జరిగిన ఈ కల్యాణ వేడుకలో 'శ్రీరామ' నామం ముద్రించిన ప్రత్యేక తలంబ్రాలు ఆకర్షణగా నిలిచాయి. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. హిజ్రాలతో ఆలయ పరిసరాలు సందడిగా నిలిచాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం జరిగిన రథోత్సవ లో ప్రభుత్వ విప్ శ్రీనివాస పాల్గొన్నారు , రాత్రి డోలోత్సవంతో ఈ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఆలయ ఈఓ ఎల్. రమాదేవి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# బ్రిక్స్ తొలి యువజన సమన్వయ సమావేశం - 2026 నిర్వహించిన భారత్

న్యూఢిల్లీ, మార్చి 27:తొలి బ్రిక్స్ యువజన సమన్వయ సమావేశం - 2026ను యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని యువజన వ్యవహారాల విభాగం వర్చువల్ విధానంలో నిర్వహించింది. 2026 మార్చి 25 సాయంత్రం 4:30 నుంచి 6:00 (ఐఎస్‌టీ) వరకు జరిగిన ఈ కార్యక్రమానికి అన్ని బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు హాజరయ్యారు.

2026 ఏడాదికి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టిన నేపథ్యంలో "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే ఇతివృత్తంతో కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించింది. ఇది ఈ ఏడాది యువజన సహకారానికి దిశానిర్దేశం చేస్తుంది.

సమావేశంలో బ్రిక్స్ యూత్ ట్రాక్ 2026 గురించి సమగ్రంగా భారత్ వివరించింది. దీనిలో కార్యాచరణ బృందాల సమావేశాలు, ఇతివృత్తాత్మక కార్యక్రమాలు, సర్వ్ బ్రిక్స్ స్వచ్ఛంద సేవా కార్యకలాపాలు, యువజన అభివృద్ధి వేదిక, యువజన మండలి సమావేశం, యువ సదస్సు, యువ మంత్రుల స్థాయి సమావేశం ఉన్నాయి.

సభ్య దేశాల మధ్య సహకారంలో ప్రధానాంశాలపై చర్చలు దృష్టి సారించాయి. వీటిలో విద్య, నైపుణ్యాలు, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, సామాజిక భాగస్వామ్యం, సమ్మిళితత్వం, ఆరోగ్యం, క్రీడలు, పర్యావరణం, సుస్థిరత, ఒకరి మతం గురించి మరొకరు తెలుసుకునేలా చర్చలు, యూత్ ఎక్స్ఛేంజ్ తదితరమైనవి ఉన్నాయి.

విస్తృతమైన నేపథ్య అంశాలపై సభ్య దేశాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చేలా చేయడానికి, బ్రిక్స్ యూత్ ట్రాక్ - 2026 పరిధిలో సహకారాన్ని బలోపేతం చేయడానికి అవసరమైన వేదికను ఈ సమావేశం అందించింది.

# పరుగుల విందు.. పండుగ సందడి... నేటి నుండి ఐపీఎల్ సమరం!

## వ్యాపారం, వినోదం: భారత ఆర్థిక వ్యవస్థకు ఊతాన్నిస్తున్న ఐపీఎల్ ప్రస్థానం




క్రీడల ప్రపంచంలో వినోదం, వ్యాపారం, ప్రతిభ అనే మూడు ప్రధాన అంశాలను సమన్వయం చేసిన అత్యంత విజయవంతమైన క్రీడా వేదికగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ నిలిచింది. 2008లో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రారంభించిన ఈ లీగ్, మొదట ఎనిమిది జట్లతో ఆరంభమై, ప్రస్తుతం 10 జట్లతో విస్తరించి ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక ఆదరణ పొందుతున్న టీ20 లీగ్‌గా ఎదిగింది. గత 18 సంవత్సరాల్లో ఐపీఎల్ కేవలం క్రికెట్ పోటీగా కాకుండా, భారత ఆర్థిక వ్యవస్థ, వినోద రంగం, మీడియా రంగాలపై ప్రభావం చూపిన భారీ వ్యవస్థగా రూపుదిద్దుకుంది.

2008లో జరిగిన తొలి ఐపీఎల్ సీజన్‌లో మొత్తం 59 మ్యాచ్‌లు నిర్వహించగా, ఇప్పుడు 2026 నాటికి సీజన్‌కు సగటున 70?74 మ్యాచ్‌లు నిర్వహించే స్థాయికి చేరుకుంది. ప్రారంభంలో జట్ల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల మ్యాచ్‌ల సంఖ్య కూడా పరిమితంగా ఉండేది. కానీ 2022లో రెండు కొత్త జట్ల చేరికతో మ్యాచ్‌ల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2026 సీజన్‌లో 10 జట్లు, రెండు గ్రూపులుగా విభజించబడి లీగ్ దశలో ఒక్కో జట్టు 14 మ్యాచ్‌లు ఆడే విధంగా షెడ్యూల్ రూపొందించ బడింది. మొత్తం సీజన్‌లో 74 మ్యాచ్‌లు నిర్వహించడం ద్వారా అభిమానులకు మరింత విస్తృతమైన పోటీ అనుభవం అందుతోంది.

జట్ల ప్రదర్శన పరంగా గణాంకాలను పరిశీలిస్తే, ముంబై ఇండియన్స్ ఇప్పటివరకు 5 సార్లు (2013, 2015, 2017, 2019, 2020) విజేతగా నిలిచి అత్యధిక టైటిళ్లు సాధించిన జట్టుగా నిలిచింది. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ కూడా 5 టైటిళ్లతో సమాన స్థాయిలో ఉంది (2010, 2011, 2018, 2021, 2023). ఈ రెండు జట్లు ఐపీఎల్ చరిత్రలో అత్యంత స్థిరంగా ప్రదర్శన ఇచ్చిన జట్లుగా గుర్తింపు పొందాయి. కోల్కతా నైట్ రైడర్స్ 2 టైటిళ్లు,సన్ రైజర్స్ హైదరాబాద్ 1 టైటిల్, రాజస్తాన్ రాయల్స్ 1 టైటిల్ సాధించాయి. తాజా జట్లలో గుజరాత్ టైటాన్స్ తమ తొలి సీజన్‌లోనే టైటిల్ సాధించడం విశేషం.

వ్యక్తిగత గణాంకాల పరంగా చూస్తే, ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ నిలిచాడు. అతను 7,500కు పైగా పరుగులు సాధించి, లీగ్ చరిత్రలో అత్యంత స్థిరమైన బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందాడు. ఒకే సీజన్‌లో అత్యధిక పరుగులు (973) చేసిన రికార్డు కూడా అతనిదే (2016). బౌలింగ్ విభాగంలో యాజువేంద్ర చాహల్ మరియు డ్వేన్ బ్రావో వంటి ఆటగాళ్లు 180కు పైగా వికెట్లు తీసి అత్యుత్తమ బౌలర్లుగా నిలిచారు. ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు క్రిస్ గేల్ పేరిట ఉందికేవలం 30 బంతుల్లో శతకం (2013).

2026 సీజన్‌లో గమనించదగ్గ అంశం యువ ఆటగాళ్ల ప్రాబల్యం. అన్‌క్యాప్‌డ్ ఆటగాళ్లు సగటున 150-180 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేస్తుండగా, బౌలింగ్‌లో 7-8 ఎకానమీతో సమర్థవంతంగా బౌలింగ్ చేస్తున్నారు. పవర్‌ప్లేలో జట్లు సగటున 50?60 పరుగులు సాధిస్తుండగా, డెత్ ఓవర్లలో ఒక్కో ఓవర్‌కు 10-12 పరుగుల రన్‌రేట్ నమోదవుతోంది. ఇది టీ20 ఫార్మాట్‌లో పెరిగిన దూకుడును సూచిస్తోంది.

వేలం గణాంకాలు కూడా ఐపీఎల్ విస్తరణను ప్రతిబింబిస్తున్నాయి. 2008లో అత్యధికంగా 1.5 మిలియన్ డాలర్లకు ఆటగాళ్లు కొనుగోలు చేయబడగా, 2026 నాటికి ఈ మొత్తం 20 కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. స్టార్ ఆటగాళ్లతో పాటు యువ ఆటగాళ్లకూ భారీ ధరలు లభిస్తున్నాయి. జట్ల బడ్జెట్ సగటున -90-100 కోట్ల మధ్య ఉండటం ఐపీఎల్ ఆర్థిక శక్తిని తెలియ జేస్తుంది.

ప్రసార హక్కుల పరంగా ఐపీఎల్ ప్రపంచంలోనే అత్యంత విలువైన క్రీడా లీగ్‌లలో ఒకటిగా నిలిచింది. 2023-2027 కాలానికి సంబంధించిన మీడియా హక్కులు సుమారు ?48,000 కోట్లకు అమ్ముడయ్యాయి. ఒక్కో మ్యాచ్‌కు సగటున ?100 కోట్లకు పైగా విలువ ఉండటం విశేషం. టెలివిజన్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఒక్కో మ్యాచ్‌ను కోట్లాది ప్రేక్షకులు వీక్షిస్తున్నారు. 2026లో కూడా డిజిటల్ వీక్షణలు 40?50 కోట్ల మధ్య నమోదవుతున్నాయి.

ఐపీఎల్ ప్రభావం భారత క్రికెట్‌పై అపారంగా ఉంది. దేశీయ స్థాయిలో రంజీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ వంటి టోర్నమెంట్‌లకు ప్రాధాన్యం పెరిగింది. గ్రామీణ ప్రాంతాల నుండి ప్రతిభ వెలుగులోకి రావడానికి ఐపీఎల్ ఒక వేదికగా మారింది. ప్రతి సీజన్‌లో కనీసం 20-25 మంది యువ ఆటగాళ్లు జాతీయ జట్టుకు ఎంపిక అవుతున్నారు.

సాంకేతికత పరంగా కూడా ఐపీఎల్ ముందంజలో ఉంది. డీఆర్‌ఎస్ వినియోగం వల్ల అంపైరింగ్‌లో ఖచ్చితత్వం పెరిగింది. డేటా అనలిటిక్స్ ఆధారంగా జట్లు వ్యూహాలు రూపొందిస్తున్నాయి. బ్యాట్స్‌మన్ షాట్ ఎంపిక నుండి బౌలర్ లైన్-లెంగ్త్ వరకు ప్రతిదీ డేటా ఆధారంగా విశ్లేషించ బడుతోంది. 2026లో ఏఐ ఆధారిత విశ్లేషణలు కూడా ప్రారంభమయ్యాయి.

అయితే ఐపీఎల్‌పై విమర్శలు కూడా ఉన్నాయి. అధిక వాణిజ్యీకరణ వల్ల ఆట యొక్క అసలు సారాంశం దెబ్బతింటోందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. ఆటగాళ్లపై ఒత్తిడి పెరగడం, అంతర్జాతీయ షెడ్యూల్‌తో ఘర్షణలు రావడం వంటి సమస్యలు ఉన్నాయి. అయినప్పటికీ ఐపీఎల్ ప్రభావం తగ్గలేదు.

మొత్తంగా 2026 ఐపీఎల్ సీజన్ గణాంకాల పరంగా, ప్రదర్శన పరంగా, ఆర్థిక పరంగా ఒక కీలక మలుపుగా నిలుస్తోంది. ప్రపంచ క్రీడా రంగంలో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలిపే శక్తిగా ఐపీఎల్ కొనసాగుతోంది. ప్రతిభకు వేదికగా, వినోదానికి కేంద్రంగా, ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చే వ్యవస్థగా ఐపీఎల్ భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

## శ్రీ పట్టాభిరామ, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణం...



కరీంనగర్, మార్చి 27:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పట్టాభిరామ , శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం రోజున శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుక లుఅంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు తిరునగిరి వెంకటాద్రి స్వామి, తిరునగిరి హర్షవర్ధన్ స్వామి ల వేదమంత్రోత్సవాల తో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుక కన్నుల పండుగ గా కొనసాగింది. ఈ సందర్భంగా వేద పండితులు తిరునగిరి వెంకటాద్రి స్వామి మాట్లాడుతూ ధర్మరక్షణలో, ఆదర్శ పరిపాలనకు నిదర్శనం మన శ్రీరామచంద్రుడన్నారు. ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు శ్రీ రామచంద్ర ప్రభువేనన్నారు. హిందూ బంధువులందరూ రాముడి అడుగుజాడల్లో నడుస్తూ , ధర్మబద్ధంగా జీవిస్తూ, ఐక్యంగా ముందు కొనసాగాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 18న తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ ( సుభాష్ నగర్ ) లో నిర్వహిస్తున్న హిందు సమ్మేళనం ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హిందూ ఐక్యతనే హిందూ సమాజానికి పెద్ద బలం లాంటిదన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ కళ్యాణ మహోత్సవానికి అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకుతీర్థ, ప్రసాదము, అన్న ప్రసాద వితరణ చేపట్టారు . కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న డివిజన్ కార్పొరేటర్ కాల్వ మల్లేశం, మహాత్మా నగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, మాజీ ఎంపీపీ కుంట రాజేందర్ లను దేవాలయ కమిటీ సన్మానించింది. ఈ కార్యక్రమంలో శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయ ధర్మకర్తల సేవాసమితి అధ్యక్షులు చిందం నరసయ్య, గడప శేఖర్, సల్ల రాజయ్య, మల్లేశం, సిరిపురం శ్రీనివాస్, చిందం ముత్యం , ఐతం వెంకన్న, శంకర శర్మ , బూట్ల కర్ణాకర్ , రాజేందర్, సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, కుమార్, మొగిలి , మధు, మహేందర్, మృత్యుంజయం , భరత్, చిందం అంజి, కొత్తూరి శ్రీనివాస్ , సాయి, అక్షయ్ లతోపాటు మహిళా భక్తులు తదితరులు అశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు

## -ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు



రాజన్న సిరిసిల్ల, మార్చి 27: నేటినిజం (ప్రతినిధి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం వేములవాడ క్షేత్రంలో పర్యటించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి తన కుటుంబ సమేతంగా భీమేశ్వరాలయాన్ని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం రాములోరి కళ్యాణందర్శనా నంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ యావత్ దేశవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాములోరి కళ్యాణం అంటేనే లోక కల్యాణమని, 'సర్వేజనా సుఖినోభవంతు' అనే నినాదంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. పాడిపంటలతో రాష్ట్రం వర్ధిల్లాలిరాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. "స్వామివారి ఆశీస్సులతో రాష్ట్రమంతటా సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో రైతులు క్షేమంగా ఉండాలి. ప్రజలందరిపై దైవకృప ఉండాలని వేడుకున్నానని ఆయన అన్నారు. సంక్షేమ పథకాలు నిర్విఘ్నంగా సాగాలిప్రస్తుత 'ప్రజా పాలన' ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా విజయ వంతంగా ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# శరీరంలో జరిగే ఈ ఒక్క మార్పే అనేక వ్యాధులకు కారణం అవుతుంది.. అదేమిటంటే..



హైదరాబాద్, మార్చి 27: మధుమేహం, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత వ్యాధులు వంటి సమస్యలు రావడానికి గల కారణాల్లో ఒకటి అధిక బరువు అన్న సంగతి అందరికీ తెలిసిందే. చాలా మందికి బరువు తగ్గితే ఈ సమస్యలు తగ్గుతాయి అనే భావన ఉంది. నిజానికి ఆరోగ్యకరమైన బరువును నిలుపుకోవడం ఉపయోగకరమే. అయితే ఆధునిక పరిశోధనలు ఈ సమస్యల వెనుక మరో కీలక కారణం దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేషన్ (వాపు) ఉందని చెబుతున్నాయి. ఈ మెటాబాలిక్ ఇన్‌ఫ్లమేషన్ చాలా నిశ్శబ్దంగా, తక్కువ స్థాయిలో కొనసాగుతూ ఉంటుంది. ఇది మనకు ప్రత్యక్షంగా అనిపించకపోయినా, శరీరం చక్కెరను ఎలా ప్రాసెస్ చేస్తుంది, కొవ్వును ఎలా నిల్వ చేస్తుంది, రక్తనాళాలను ఎలా రక్షిస్తుంది అనే ప్రక్రియలపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం అనేక వైద్య సంస్థలు, మార్గదర్శకాలు కూడా ఇన్‌ఫ్లమేషన్‌ను మెటబాలిక్ వ్యాధులకు ప్రధాన కారణంగా గుర్తిస్తున్నాయి.

### కీలకంగా మారే ఇన్‌ఫ్లమేషన్..

మధుమేహం, ఫ్యాటీ లివర్, గుండె వ్యాధులు పరస్పరం బలమైన సంబంధం కలిగినవే. ఇవి తరచూ కలిసి అభివృద్ధి చెందుతాయి, ఎందుకంటే వీటి మెటబాలిక్ మార్గాలు ఒకే విధంగా ఉంటాయి. ఇందులో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. శరీరానికి అవసరమైనదానికంటే ఎక్కువగా శుద్ధి చేసిన కార్బొహైడ్రేట్లు, చక్కెరలు, అధిక కేలరీలు తీసుకుంటే, లివర్ ఆ అదనపు శక్తిని కొవ్వుగా మారుస్తుంది. కాలక్రమేణా ఈ కొవ్వు లివర్ కణాల్లో పేరుకుపోయి ఫ్యాటీ లివర్‌కు దారితీస్తుంది. ఫ్యాటీ లివర్ కేవలం కొవ్వును నిల్వ చేయడమే కాకుండా, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచే రసాయన సంకేతాలను విడుదల చేస్తుంది. ఇవి ఇన్సులిన్ పనితీరును దెబ్బతీసి, రక్తంలో చక్కెర నియంత్రణలను కష్టతరం చేస్తాయి. దీంతో ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరిగి, ప్యాంక్రియాస్‌పై ఒత్తిడి పెరుగుతుంది. అదే సమయంలో రక్తనాళాల గోడలను కూడా ఈ ఇన్‌ఫ్లమేషన్ ప్రభావితం చేసి, గుండె వ్యాధులు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది.

### ఆహారం, జీవనశైలి ముఖ్యం..

ఆహారం, జీవనశైలి ఇన్‌ఫ్లమేషన్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెరలు, మైదాతో చేసిన పదార్థాలు, తీపి పానీయాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తరచూ పెరిగిపోతాయి. ఇది లివర్‌లో కొవ్వు నిల్వను పెంచి, ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను మరింత తీవ్రతరం చేస్తుంది. దీనికి విరుద్ధంగా కూరగాయలు, పప్పులు, గింజలు, విత్తనాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. ఇవి ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అందించి గట్ హెల్త్ (జీర్ణాశయ ఆరోగ్యం)ను మెరుగుపరుస్తాయి. అందుకే ప్రస్తుతం పోషకాహార సూచనలు కేవలం కేలరీలపై కాకుండా ఆహారం నాణ్యతపై దృష్టి పెడుతున్నాయి. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే మెటాబాలిక్ వ్యాధులు కేవలం అధిక బరువు ఉన్నవారిలోనే కాదు. ముఖ్యంగా దక్షిణాసియా ప్రజల్లో సాధారణ బరువుతో ఉన్నవారికీ ఫ్యాటీ లివర్, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సమస్యలు కనిపిస్తున్నాయి. అంటే మెటబాలిక్ ఆరోగ్యం కేవలం బరువుతో నిర్ణయించబడదు.

### ఈ సూచనలు పాటించాలి..

ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడానికి చిన్న చిన్న మార్పులు చాలా ఉపయోగపడతాయి. రోజువారీ జీవితంలో సులభంగా పాటించగల అలవాట్లు దీర్ఘకాల ప్రయోజనాలు ఇస్తాయి. మంచి ప్రోటీన్ తీసుకోవడం, పప్పులు, బీన్స్, సోయా, గుడ్లు, పాలు, గింజలు వంటి ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి. మైదా, తీపి పదార్థాలను తగ్గించడం గ్లూకోజ్ స్పైక్స్‌ను తగ్గిస్తుంది. ప్రతి భోజనంలో ఫైబర్ కలిగిన ఆహారాలైన కూరగాయలు, పండ్లు, ధాన్యాలు తీసుకోవడం గట్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అలాగే విత్తనాలు, నట్‌లు, ఆలివ్ ఆయిల్, చేపలలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. రోజూ శారీరకంగా చురుకుగా ఉండటం, నడక వంటి వ్యాయామాలు చేయడం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తాయి. సరైన నిద్ర, ఒత్తిడి నియంత్రణ కూడా ఇన్‌ఫ్లమేషన్ తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కేవలం బరువు తగ్గడంపైనే దృష్టి పెట్టడం సరిపోదు. మెటాబాలిక్ ఆరోగ్యం కోసం జీవనశైలిని సమతుల్యం చేయడం అత్యంత ముఖ్యం. తక్కువ తినడం లేదా బరువు తగ్గడం మాత్రమే కాదు, శరీరం సక్రమంగా పనిచేయడానికి, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడానికి అవసరమైన అలవాట్లను అలవరుచుకోవడమే నిజమైన ఆరోగ్యానికి మార్గమని వైద్యులు చెబుతున్నారు.

## 'ఇంధన కొరతతో దేశంలో లాక్‌డౌన్'పై స్పందించిన కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 27: పశ్చిమాసియా లో ఇరాన్ పై అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దేశీయంగా ఇంధన కొరత ఏర్పడుతున్నదనే ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పెట్రోల్ డీజిల్ కోసం వాహనదారులు బారులు తీరుతున్నారు. మరోవైపు 'లాక్‌డౌన్ భయాలు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ దీనిపై స్పష్టతనిచ్చారు. 'లాక్‌డౌన్' వార్తలను కొట్టిపారేసిన కేంద్ర మంత్రి ఇంధన లభ్యతకు కేంద్రం చర్యలను వివరిస్తూ వరుస ట్వీట్లు చేశారు.

'అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఎనర్జీ, సరఫరా గొలుసు అత్యవసర సరకు రవాణా వంటి అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. దేశంలో ఇంధన సరఫరాకు అంతరాయం కలుగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. లాక్‌డౌన్‌పై వినిపిస్తున్న ఊహాగానాలు పూర్తిగా అవాస్తవం. అలాంటి ప్రతిపాదనేదీ కేంద్ర ప్రభుత్వం వద్ద లేదు. ఇలాంటి వదంతులు సమాజానికి హాని చేస్తాయి. గందరగోళం సృష్టిస్తాయి. ఈ సమయంలో మనమంతా ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా, ఐకమత్యంగా ఉండాలి' అని కేంద్రమంత్రి స్పష్టంచేశారు.

'గత నెల రోజుల్లో అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 122 డాలర్ల వరకు వెళ్లొచ్చింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ఆగ్నేయాసియా దేశాల్లో 30-50 శాతం, ఉత్తర అమెరికాలో 30 శాతం, యూరప్‌లో 20 శాతం, ఆఫ్రికా దేశాల్లో 50 శాతం మేర ఇంధన ధరలు పెరిగాయి. కానీ మన దేశంలో పౌరుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ వీటిని పెంచలేదు. అంతేగాక చమురు కంపెనీలు అధిక నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వ పన్ను ఆదాయాన్ని తగ్గించుకున్నాం. అదే సమయంలో విదేశాలకు ఎగుమతి చేసే ఇంధనంపై ఎగుమతి పన్ను విధించాం' అని పురీ వెల్లడించారు.

విదేశాలకు ఎగుమతిచేసే డీజిల్‌పై లీటర్‌కు రూ.21.5 చొప్పున పన్ను విధించినట్లు కేంద్రం ప్రకటన విడుదల చేసింది. ఇక ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఏటీఎఫ్) పై లీటర్‌కు రూ.29.5 శాతం పన్ను విధిస్తున్నట్లు తెలిపింది.

# మల్కపేటలో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

## -చల్మెడ ఆనందరావు, చల్మెడ లక్ష్మీనరసింహారావులు హాజరు



రాజన్న సిరిసిల్ల, మార్చి 27: నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలోని శ్రీ సీతారామ హనుమ సమేత రామాలయంలో శ్రీ కోదండ రాముని కళ్యాణ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. పునర్వసు నక్షత్ర యుక్త అభిజిత్ లగ్నాన వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కళ్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు ఆలయ వ్యవస్థాపకులు, మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. వేములవాడ నియోజకవర్గ బిఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు - సునీల దంపతులు కళ్యాణ వేడుకలో పీటలపై కూర్చుని స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు మల్కపేట గ్రామస్తులే కాకుండా, జిల్లా నలుమూలల నుండి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా "జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్" అనే నామస్మరణతో మారుమోగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ యువకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కళ్యాణం అనంతరం భక్తులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. చల్మెడ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుక మల్కపేటలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు.

# నిట్‌లో 'ఇండస్ట్రీ అకాడమియా ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్'




హన్మకొండ, మార్చి 27: ఇండస్ట్రీ అకాడమియా ఇన్నోవేషన్ కాన్ క్లేవ్ మూడో ఎడిషన్ శుక్రవారం నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్డ్ రీసెర్చ్ అండ్ ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ విభాగం, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యుబేషన్‌తో కలిసి, పరిశ్రమ-అకాడమియా అనుసంధానాన్ని బలోపేతం చేయడానికి చేపట్టినట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. ఈ కాన్‌క్లేవ్‌లో పరిశ్రమ, అకాడమియా, పరిశోధనా సంస్థల ప్రముఖులు పాల్గొని, పరస్పర సహకారాన్ని మరింతగా పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి వేగవంతం చేయడం, ఆవిష్కరణల ఆధారిత అభివృద్ధిని ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చించినట్లు చెప్పా రు.

సాంకేతిక సెషన్లు, ప్యానెల్ చర్చలు, స్టార్టప్ ప్రదర్శనలు టెక్నాలజీ స్టాల్స్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, ఇవి అత్యాధునిక ఆవిష్కరణలను ప్రదర్శించడానికి, పరస్పర సంభాషణలకు ఉత్తమ వేదికగా నిలిచినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య ఆకర్షణగా, సంస్థ కమ్యూనికేషన్, అవుట్ రీచ్ సామర్థ్యాలను మెరుగుపరచడానికి ఉపయోగపడే అత్యాధునిక ఎల్‌ఈడి బోర్డ్‌ను ప్రారంభించారు. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ శివకుమార్ కల్యాణరామన్ ఆన్‌లైన్ ద్వారా కీలక ప్రసంగం అందించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com